## నేటి కందం-నేటికి అందం

వ్యోమ విమానము నందున
సామాన్యుల గాచు సాహసము చూపింపన్
కామాక్షీధవు దభవుడు
శేముషి నిడి బ్రోచుగాత స్మిత్ మచ్చారున్ !!

(ఆకాశంలో విమానాన్ని నడిపిస్తూ, భారత పైలట్ స్మిత్ మచ్చార్ తాను గాయపడి కూడా నూటా డెబ్బై నాలుగు మంది ప్రాణాలు కాపాడడంతో అందరూ అతడిని ప్రశంసించారు. భారత కీర్తి ఇనుమడించింది.)



-రాధశ్రీ
సెల్:9494481210

# నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com ఎడిటర్: బైస దేవదాస్ సెల్:9000065433 E-mail:netinijam93@gmail.com

## చురక

ఆంధ్ర తెలంగాణాల్లో
అదనంగా బీసీ కోట
కోర్టుల్లో రద్దుతోని
కొండెక్కెను దాని బాట.
అమలులోన అడ్డంకులు
అనితెలిసినా అధినేతలు
ఆశపెడితే ఓట్లకొరకు
అబాసాయె తలరాతలు



-వేల్పుల నారాయణ
9440433475

హైదరాబాద్ శనివారం 3-10-2026 NETI NIZAM Telugu Daily, RNI No.52865/93 • Postal No.HQ/SD/258/2024-2026. Posting at BPC-IV, Patrika channel, Nampally, Hyderabad-500 001. సంపుటి :33 సంచిక:54 పేజీలు:6 వెల: రూ.1/-


# రెండు డీఏల విడుదలకు కేబినెట్ ఆమోదం.. టీఎన్జీవోల హర్షం

హైదరాబాద్, అక్టోబర్ 2: రెండు డీఏల విడుదలకు రాష్ట్ర కేబినెట్ ఆమోదం తెలపడంపై తెలంగాణ నాన్ గెజిటెడ్ ఆఫీసర్స్ (టీఎన్జీవో) సంఘం హర్షం వ్యక్తం చేసింది. ఉద్యోగులు, పెన్షనర్లకు సంబంధించిన డీఏల విడుదలకు చర్యలు తీసుకున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కకు టీఎన్జీవో నేతలు మారం జగదీశ్వర్, ఎస్.ఎం. హుస్సేనీ ముజీబ్ కృతజ్ఞతలు తెలిపారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం సానుకూలంగా స్పందించాలని కోరారు. ముఖ్యంగా పీఆర్సీ నివేదికను వెంటనే తెప్పించి.. 51 శాతం ఫిట్‌మెంట్‌తో కొత్త పే స్కేళ్లను అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఉద్యోగులు, పెన్షనర్లకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న బిల్లులన్నింటినీ మంజూరు చేసి ఆర్థిక ఇబ్బందులు తొలగించాలని కోరారు.

అదేవిధంగా ఉద్యోగుల హెల్త్ కార్డుల అమలులో ఎదురవుతున్న సమస్యలను పరిష్కరించి.. వైద్య సేవలు సక్రమంగా అందేలా చర్యలు తీసుకోవాలని టీఎన్జీవోలు విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వంపై అదనపు ఆర్థిక భారం పడని ఉద్యోగుల సమస్యలను కూడా పరిష్కరించాలని కోరారు. దాదాపు 90 శాతం ఉద్యోగులకు సంబంధించిన ఇలాంటి సమస్యల పరిష్కారంపై ప్రభుత్వం దృష్టి సారించాలని టీఎన్జీవో నేతలు సూచించారు. డీఏల విడుదలకు కేబినెట్ ఆమోదం లభించిన నేపథ్యంలో మిగిలిన ఉద్యోగుల సమస్యలపైనా ప్రభుత్వం సానుకూల నిర్ణయాలు తీసుకుంటుందన్న ఆశాభావాన్ని వ్యక్తం చేశారు

# విజయవంతమైన హక్కుల కోసం జర్నలిస్టుల సమరభేరి



గన్‌పార్క్ వేదికగా ఐజేయూ పిలుపు మేరకు జరిగిన భారీ నిరసన కార్యక్రమంలో ప్రసంగిస్తున్న జర్నలిస్టు నాయకుడు డి. అమర్. కార్యక్రమంలో పాల్గొన్న అకాడమీ చైర్మన్ కె. శ్రీనివాస్ రెడ్డి, అశోక్, యూసుఫ్‌బాబు, ఆజాం ఖాన్ , కె. విరాహత్ అలీ పలువురు జర్నలిస్టు నాయకులు.



మీడియా అకాడమీ చైర్మన్ కె. శ్రీనివాస్ రెడ్డికి ఆరు ప్రధాన డిమాండ్లతో కలిగిన వినతి పత్రం సమర్పిస్తున్న జర్నలిస్టులు.

హైదరాబాద్, అక్టోబర్ 2: (నేటినిజం ప్రతినిధి): IJU జాతీయ కమిటీ, UWJ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు దేశవ్యాప్తంగా నిర్వహించిన ఆందోళనలో భాగంగా, హైదరాబాద్‌లో తెలంగాణ రాష్ట్ర అసెంబ్లీ ఎదురుగా గన్‌పార్క్ వద్ద అక్టోబర్ 2న నిర్వహించిన నిరసన కార్యక్రమానికి భారీ సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేసిన పత్రికా సంస్థల అధినేతలు, సంపాదకులు, జర్నలిస్టులు, మీడియా మిత్రులందరికీ హృదయపూర్వక ధన్యవాదాలు అని టిఎస్ఎంఎన్ఎంఎ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అశోక్ తెలిపారు. జర్నలిస్టుల హక్కులు, గౌరవం, భద్రత, సంక్షేమం కోసం నిర్వహించిన ఈ కార్యక్రమానికి మీరు చూపిన ఐక్యత, నిబద్ధత, పోరాట స్ఫూర్తి అభినందనీమని అన్నారు.

ఒక్కరి సమస్య అందరి సమస్యగా భావించి, జర్నలిస్టుల హక్కుల పరిరక్షణ కోసం ఐక్యంగా నిలబడిన ప్రతి ఒక్కరికీ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. మీ అమూల్యమైన సహకారం, భాగస్వామ్యం ఈ కార్యక్రమానికి మరింత బలాన్ని చేకూర్చింది. భవిష్యత్తులో కూడా జర్నలిస్టుల హక్కులు, సంక్షేమం కోసం ఇదే ఐక్యతతో ముందుకు సాగుదామని అశోక్ పేర్కొన్నారు.

# గాంధీజీ ఆశయ సాధనకు కృషి చేద్దాం: మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి



నల్గొండ, అక్టోబర్ 2:జాతిపిత మహాత్మా గాంధీ జయంతి సందర్భంగా నల్లగొండ పట్టణంలో ఘన నివాళుల కార్యక్రమం నిర్వహించారు.పట్టణంలోని గాంధీజీ విగ్రహానికి రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి పూలమాల వేసి నివాళులర్పించారు.

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. సత్యం, అహింస, శాంతి మార్గాల్లో నడిచిన మహాత్మా గాంధీ దేశ స్వాతంత్ర్య ఉద్యమానికి, అభివృద్ధికి దిశానిర్దేశం చేశారని కొనియాడారు. గాంధీజీ బోధించిన విలువలు, ఆశయాలను ప్రతి ఒక్కరూ స్ఫూర్తిగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. గాంధీజీ అడుగుజాడల్లో నడుస్తూ ఆయన ఆశయాల సాధనకు కట్టుబడి ప్రజాసేవలో ప్రతి ఒక్కరూ ముందంజలో ఉండాలని మంత్రి సూచించారు.

ఈ కార్యక్రమంలో నల్లగొండ మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాస్‌రెడ్డి, కలెక్టర్ చంద్రశేఖర్, ఎస్పీ శరత్ చంద్ర పవార్ తదితరులు పాల్గొన్నారు.

# మచ్చర్‌తో మోదీ వీడియో కాల్.. హనుమాన్ చాలీసా స్మరించినట్లు చెప్పిన పైలట్..



న్యూ ఢిల్లీ, అక్టోబర్ 2:ఫ్లైదుబాయ్ విమానాన్ని హైజాక్ కుట్ర నుంచి తప్పించి, సుమారు 170 ప్రయాణికుల ప్రాణాలను కాపాడిన కెప్టెన్ స్మిత్ మచ్చర్‌తో ఇవాళ ప్రధాని మోదీ(ఖఓ ఓనీటతి) వీడియో కాల్ ద్వారా మాట్లాడారు. దుబాయ్ నుంచి టెల్ అవివ్ విమానం ప్రయాణిస్తున్న సమయంలో .. కాక్‌పిట్‌లో పైలట్ మచ్చర్‌పై కోపైలట్ అటాక్ చేసిన విసయం తెలిసిందే. అయితే ఆ సమయంలో ధైర్యం కోసం తన మనసులో హనుమాన్ చాలీసా వల్లించినట్లు కెప్టెన్ మచ్చర్ తెలిపారు. 11 ఏళ్లుగా పైలట్‌గా ఉన్నానని, దాడి జరిగిన తర్వాత కింద పడిపోయానని, అక్కడ ఏం జరుగుతుందో తనకు తెలుసు అని, కానీ రియాక్ట్ అయ్యేందుకు కొన్ని సెకన్ల సమయం మాత్రమే ఉందని, ఆ సమయంలో నిరంతరంగా హనుమాన్ చాలీసాను స్మరించానని, కాక్‌పిట్ డోర్‌ను ఓపెన్ చేసేందుకు శక్తిని కూడగట్టుకున్నానని, ఆ తర్వాత ప్రయాణికులు వచ్చినట్లు మోదీతో కెప్టెన్ మచ్చర్ పేర్కొన్నారు.

సౌదీ అరేబియాలోకి తబుక్ విమానాశ్రయంలో ఫ్లైదుబాయ్ ఫ్లయిట్‌ను అత్యవసరంగా ల్యాండ్ చేశారు. అక్కడ మచ్చర్‌కు ప్రథమ చికిత్స చేశారు. ఆ తర్వాత మెరుగైన చికిత్స కోసం అతన్ని అబూ దాబికి తరలించారు. ఆస్పత్రిలో కోలుకుంటున్న మచ్చర్‌తో మోదీ మాట్లాడారు. ఆ వీడియో ఫూటేజ్‌ను పీఎంవో రిలీజ్ చేసింది. గుజరాతీ భాషలో స్మిత్‌తో మోదీ మాట్లాడారు. సోమనాథ్, కాశీ క్షేత్రాల్లో త్వరగా కోలుకోవాలని పూజలు చేసినట్లు చెప్పారు. అత్యంత ధైర్యసాహసాలు ప్రదర్శించినట్లు పైలట్‌ను ప్రధాని మెచ్చుకున్నారు.

భారతీయులు ప్రాణాలు తీయరని, భారతీయులు ప్రాణాలు కాపాడుతారని ఈ సందర్భంగా ప్రధాని మోదీ చెప్పారు. కోపైలట్ దాడి చేసిన తర్వాత తాను కేవలం ప్రయాణికుల ప్రాణాల గురించి మాత్రమే ఆలోచన చేసినట్లు స్మిత్ తెలిపాడు. హనుమాన్ చాలీసా ప్రతి రోజు చదువుతుంటానని చెప్పాడు. పేరెంట్స్‌తో మాట్లాడినట్లు మచ్చర్‌తో ప్రధాని మోదీ తెలిపారు. ప్రపంచం నీతో మాట్లాడేందుకు ఆసక్తిగా ఉందని, వెల్కమ్ చెప్పేందుకు ఇండియా ఎదురుచూస్తోందని ప్రధాని అన్నారు.

# రాయలసీమను గ్లోబల్ హార్టికల్చర్ హబ్‌గా తయారు చేస్తాం: సీఎం చంద్రబాబు



అమరావతి, అక్టోబర్ 2: రాయలసీమను రూ.లక్ష కోట్లతో గ్లోబల్ హార్టికల్చర్ హబ్‌గా తయారు చేస్తామని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వ్యాఖ్యానించారు. అన్నమయ్య జిల్లాలోని మదనపల్లెలో రాయలసీమ హార్టికల్చర్ హబ్‌కు ఈరోజు (శుక్రవారం) శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో కేంద్రమంత్రి నిర్మలా సీతారామన్, సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రి లోకేశ్, అనంత్ అంబానీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు ప్రసంగించారు. 'ఇవాళ్టి నుంచి అనంత్ అంబానీ తెలుగు బిడ్డ.. మనందరి ముద్దు బిడ్డ' అని ప్రశంసించారు. అనంత్ అంబానీ ఏ ప్రాజెక్ట్ చేపట్టినా విజయవంతం చేస్తారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో మదనపల్లె ప్రజల ఉత్సాహం అదిరిపోయిందని అన్నారు. కరువుసీమలో గొప్ప కార్యక్రమం చేపట్టామని వివరించారు. కరువు సీమ.. సిరుల సీమ అవుతుందని చెప్పుకొచ్చారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ సహకారంతో రాయలసీమను గ్లోబల్ హార్టికల్చర్ హబ్‌గా మార్చబోతున్నామని ఉద్ఘాటించారు. అన్నదాతకు ఉపయోగపడేలా గ్లోబల్ హార్టికల్చర్ హబ్ ఏర్పాటు చేస్తామని తెలిపారు.

అక్టోబర్ 2, 2026 రాయలసీమ చరిత్రలో నిలిచిపోతుందని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. ఈ అభివృద్ధికి కారణం మీరిచ్చిన విజయమేనని చెప్పారు. ఏపీ అభివృద్ధికి కేంద్రమంత్రి నిర్మలా సీతారామన్ సహకరిస్తున్నారని తెలిపారు. ఏది కావాలని కోరినా అన్నింటికీ ఆమె డబ్బులు ఇస్తున్నారని ప్రశంసించారు. విశాఖపట్నం ఉక్కుకు డబ్బులిచ్చి నిలబెట్టారని కొనియాడారు. సాగునీరు ఇస్తే రాయలసీమ ప్రజలు బంగారం పండించగలరని వెల్లడించారు. యాపిల్ నుంచి స్ట్రాబెర్రీ వరకు రాయలసీమ రైతులు పండించగలరని తెలిపారు. అప్పట్లో తనను ఐఖా అని, హైటెక్ సీఎం అని అనేవాళ్లని ప్రస్తావించారు. ఇప్పుడు వాటర్‌మెన్ అంటుంటే సంతోషంగా ఉందని అన్నారు. ఇండియన్ స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్ వ్యవసాయంలో పెనుమార్పులు తీసుకువస్తున్నామని వెల్లడించారు. ఎఐఓలో మేనేజ్‌మెంట్ లీడర్లు,.. ఎఐ టెక్నాలజీ నిపుణులు తయారవుతారని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు.

# నన్ను ఆంధ్ర బిడ్డగా భావించండి: అనంత్ అంబానీ



అమరావతి, అక్టోబర్ 2:'ఆంధ్ర భూమి.. సువర్ణ భూమి.. నన్ను ఆంధ్ర బిడ్డగా భావించండి. రాష్ట్రానికి నేనేం చేయగలనో గైడ్ చేయాలి' అని సీఎం చంద్రబాబును రిలయన్స్ ఇండస్ట్రీస్ ఎగ్జిక్యూటీవ్ డైరెక్టర్ అనంత్ అంబానీ (ంనిజీనిబి ంఎజీనితి) కోరారు. గ్లోబల్ హార్టికల్చర్ హబ్, ఇండియన్ స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్‌కు శంకుస్థాపన చేయడం సంతోషంగా ఉందని పేర్కొన్నారు. అన్నమయ్య జిల్లాలోని మదనపల్లెలో రాయలసీమ హార్టికల్చర్ హబ్‌కు ఈరోజు (శుక్రవారం) శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో కేంద్రమంత్రి నిర్మలా సీతారామన్, సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రి లోకేశ్, అనంత్ అంబానీ పాల్గొన్నారు. రూ.లక్ష కోట్లతో రాయలసీమ హార్టికల్చర్ హబ్‌ను ప్రభుత్వం ఏర్పాటు చేస్తుంది. ఈ సందర్భంగా అనంత్ అంబానీ మాట్లాడారు. దేశ ఆర్థికాభివృద్ధికి కేంద్రమంత్రి నిర్మలా సీతారామన్ ఎన్నో ప్రణాళికలు చేశారని ఉద్ఘాటించారు. ఏపీలో పంచాయతీల బలోపేతానికి డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ విశేషంగా కృషి చేస్తున్నారని అనంత్ అంబానీ పేర్కొన్నారు. గ్లోబల్ హార్టికల్చర్ హబ్, ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్ శంకుస్థాపన కార్యక్రమంలో తన ప్రసంగంతో ఆయన ఆకట్టుకున్నారు. ప్రసంగం అనంతరం అనంత్ అంబానీని ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేశ్ ప్రశంసించారు. ఈ సందర్భంగా ఆయనను అప్యాయంగా సీఎం చంద్రబాబు ఆలింగనం చేసుకున్నారు.

# ప్రజా రవాణాను ఏకీకృతం చేసే దిశగా కీలక అడుగు వేశాం: సీఎం రేవంత్‌రెడ్డి



హైదరాబాద్, అక్టోబర్ 2: హైదరాబాద్‌లో ఆర్టీసీ, మెట్రో ఉమ్మడి కామన్ ట్రావెల్ పాస్ ఈరోజు (శుక్రవారం) నుంచి అందుబాటులోకి వస్తుందని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలిపారు. అన్ని మెట్రోస్టేషన్లలో ఈ పాస్ జారీ చేస్తారని వెల్లడించారు. ఈ పాసుతో ఖీఖీ పరిధిలోని సిటీ బస్సులు, మెట్రోలో ప్రయాణించవచ్చని చెప్పుకొచ్చారు. ఈ కామన్ పాసుపై సీఎం ఎక్స్ వేదికగా పోస్టు పెట్టారు.

ఓఆర్ఆర్ పరిధిలోని సిటీ బస్సుల్లో ఈ పాస్ చెల్లుబాటవుతోందని ముఖ్యమంత్రి వెల్లడించారు. బస్సు మెట్రోకు ఇక రెండో టికెట్ అవసరం లేదని తెలిపారు. 25 లక్షలకు పైగా బస్సు ప్రయాణికులకు ఈ కామన్ పాసుతో ప్రయోజనం ఉంటుందని చెప్పుకొచ్చారు. 4.5 లక్షల మంది మెట్రో ప్రయాణికులకు ప్రయోజనం కలుగుతుందని వివరించారు. మెరుగైన లాస్ట్‌మైల్ కనెక్టివిటీపై తాము ఫోకస్ పెట్టామని అన్నారు. ప్రజా రవాణాను ఏకీకృతం చేసే దిశగా కీలక అడుగు వేశామని తెలిపారు. హైదరాబాద్‌ను 'ఫాస్టెస్ట్ సిటీస్'లో ఒకటిగా మార్చడమే అజఖీఇ లక్ష్యమని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు.

కాగా, ఆర్టీసీ బస్ – మెట్రో రైల్ కలిపి రోజు, నెల వారి పాసులను సీఎం రేవంత్‌రెడ్డి సర్కార్ జారీ చేసింది. ఆర్టీసీ మెట్రో రైల్ జాయింట్ పాసుతో ఆర్టీసీ బస్సు, మెట్రో రైల్లో ప్రయాణించే సదుపాయం కల్పించింది. రోజు వారి పాస్ రూ.400, నెల వారి పాస్ రూ.8500 ఖరారు చేసింది. ఆర్టీసీ బస్సుల్లో ఆన్‌లైన్ టికెటింగ్‌ను ప్రభుత్వం తీసుకువచ్చింది. కండక్టర్‌తో పని లేకుండా మొబైల్లోనే టికెట్ పొందే సదుపాయం కల్పించింది. ఫిజికల్ టికెట్ అవసరం లేకుండా మొబైల్లోనే టికెట్ పొందే సదుపాయం తీసుకువచ్చింది. వారం రోజుల పాసును సైతం ఆర్టీసీ తీసుకువచ్చింది. మీ టికెట్ యాప్ ద్వారా మొబైల్లోనే రోజు వారి టికెట్, డే పాస్, వారం, నెల వారి బస్ పాసులను పొందే సదుపాయాన్ని రాష్ట్ర సర్కార్ కల్పించింది.

# విద్యార్థుల బ్రేక్‌ఫాస్ట్ స్కీమ్.. సెంట్రల్ కిచెన్లపై సీఎం రేవంత్ ఆదేశాలు



హైదరాబాద్, అక్టోబర్ 2: తెలంగాణలో ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల బ్రేక్‌ఫాస్ట్ స్కీమ్‌కు సంబంధించి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాలు జారీ చేశారు. నవంబర్ 30లోగా సెంట్రల్ కిచెన్లు పూర్తయ్యేలా చూడాలని.. డిసెంబర్ 9న రాష్ట్రవ్యాప్తంగా ఒకేసారి సెంట్రల్ కిచెన్ల ప్రారంభమవ్వాలని స్పష్టం చేశారు. ఈరోజు(శుక్రవారం) ముఖ్యమంత్రిని హరే కృష్ణ ఫౌండేషన్ ప్రతినిధులు జూబ్లీహిల్స్ నివాసంలో కలిశారు. ఈ సందర్భంగా సీఎం సమక్షంలో ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల బ్రేక్‌ఫాస్ట్ స్కీమ్ కోసం హరే కృష్ణ ఫౌండేషన్‌తో జున్నా సోలార్ సిస్టమ్స్ ప్రైవేట్ లిమిటెడ్, చైన్ ల్యాబ్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ ఒప్పందం చేసుకుంది. నాగర్‌కర్నూల్, వికారాబాద్‌లలో ఆధునిక సెంట్రలైజ్డ్ కమ్యూనిటీ కిచెన్ల ఏర్పాటు కోసం ఈ సంస్థలు సహకారం అందించనున్నాయి. ఇందులో భాగంగా నాగర్‌కర్నూల్‌లో సెంట్రలైజ్డ్ కమ్యూనిటీ కిచెన్ కోసం రూ. 5.17 కోట్ల చెక్కును సీఎం చేతుల మీదుగా హరే కృష్ణ ఫౌండేషన్‌కు జున్నా సోలార్ సిస్టమ్స్ ప్రైవేట్ లిమిటెడ్ సీఎండీ శేఖర్ రెడ్డి, సీఈవో అనిల్ బాబు అందజేశారు.

అలాగే, వికారాబాద్‌లో ఆధునిక సెంట్రలైజ్డ్ కమ్యూనిటీ కిచెన్ నిర్మాణం కోసం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా రూ.4 కోట్ల చెక్కును హరే కృష్ణ ఫౌండేషన్‌కు చైన్ ల్యాబ్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ ప్రతినిధి సమంత డే, వైస్ ప్రెసిడెంట్ బుగత సంతోష్ కుమార్ అందించారు. నిధులు అందించిన సంస్థల ప్రతినిధులను రేవంత్ రెడ్డి అభినందించారు. ఈ సమావేశంలో సీఎం మాట్లాడుతూ... ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే విద్యార్థుల ట్రాక్ రికార్డును నిర్వహించాలని అన్నారు. విద్యార్థుల శారీరక పెరుగుదల, విద్యా పురోగతి వంటి అంశాలను ఎప్పటికప్పుడు రికార్డు చేయాలని సూచించారు. ఆహారంలో ఇచ్చే పదార్థాల క్యాలరీలను లెక్కించడానికి యాప్‌లను ఉపయోగించుకోవాలని తెలిపారు.

బ్రేక్‌ఫాస్ట్ వల్ల విద్యార్థులు సమయానికి పాఠశాలకు చేరుకుంటారని సీఎం అన్నారు. ఆహార నాణ్యత విషయంలో జాగ్రత్తలు పాటించాలని సూచించారు. ప్రాంతాల వారీగా అక్కడి అలవాట్లకు అనుగుణంగా బ్రేక్‌ఫాస్ట్ తయారు చేయాలన్నారు. సెంట్రల్ కిచెన్లను కమాండ్ కంట్రోల్ సెంటర్‌కు అనుసంధానం చేస్తామని చెప్పారు. జీవితకాలం కొనసాగే కార్యక్రమం ఇదని.. కాబట్టి అత్యంత జాగ్రత్త వహించాలని వెల్లడించారు. నవంబర్ 30లోగా సెంట్రల్ కిచెన్లు పూర్తి అయ్యేలా చూడాలని.. డిసెంబర్ 9న రాష్ట్రవ్యాప్తంగా ఒకేసారి సెంట్రల్ కిచెన్ల ప్రారంభమవ్వాలని ఆదేశించారు. సెంట్రల్ కిచెన్లను విద్యార్థులు సందర్శించేలా చర్యలు తీసుకోవాలని సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, రాజ్యసభ సభ్యుడు వేం నరేందర్ రెడ్డి, సీఎం ప్రిన్సిపల్ సెక్రటరీ శ్రీధర్, హరే కృష్ణ ప్రతినిధి సత్య గౌర చంద్ర దాస్ స్వామిజీ పాల్గొన్నారు.

# కొడంగల్‌లో బీఆర్ఎస్ సభ.. రేవంత్‌కు చెమటలు పట్టిస్తాం: తలసాని శ్రీనివాస్ యాదవ్

హైదరాబాద్, అక్టోబర్ 2: బీఆర్ఎస్ సభతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చెమటలు పట్టిస్తామని మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. ఈరోజు(శుక్రవారం) మీడియాతో నిర్వహించిన చిట్‌చాట్‌లో మాట్లాడుతూ.. త్వరలోనే కొడంగల్‌లో బీఆర్ఎస్ సభను నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ముఖ్యమంత్రి హోదాలో రేవంత్ రెడ్డి రాష్ట్రంలో ఎక్కడైనా పర్యటించవచ్చని.. సిరిసిల్లలో బలప్రదర్శన చేయాల్సిన అవసరం లేదన్నారు. సిరిసిల్ల ఏమైనా పక్క రాష్ట్రంలో ఉందా అని ప్రశ్నించారు. రేవంత్.. సిద్దిపేటలో కూడా సభ పెడతానంటున్నారని అన్నారు. సిద్దిపేట సభ తర్వాత కొడంగల్‌లో బీఆర్ఎస్ సభ ఉంటుందని ప్రకటించారు. సిరిసిల్ల సభతో రేవంత్‌కు వచ్చిన మైలేజ్ కంటే నష్టమే ఎక్కువన్నారు.

తాము కొడంగల్‌లో పెట్టే సభతో ముఖ్యమంత్రికి చెమటలు పడతాయని తలసాని అన్నారు. ఖైరతాబాద్ బైపోల్స్‌లో వంద శాతం బీఆర్ఎస్ గెలుస్తుందని ధీమా వ్యక్తం చేశారు. పార్టీలు మారటంతో దానం నాగేందర్‌పై ఖైరతాబాద్ ఓటర్లు ఆగ్రహంతో ఉన్నారని తెలిపారు. గతంలో ఓటు హక్కు వినియోగించుకోని వారు కూడా బైపోల్స్‌లో కసితో ఓటు వేస్తారన్నారు. జూబ్లీహిల్స్, కంటోన్మెంట్ ఉపఎన్నిక పరిస్థితి వేరని చెప్పుకొచ్చారు. డబ్బులు ఇచ్చినా ఈసారి ఓటర్లు కాంగ్రెస్‌కు ఓటు వేయరన్నారు. 'అసెంబ్లీ నుంచి సస్పెండ్ చేసేంత సీన్ మేము ఏం చేశాం? బయట జరిగిన గొడవకు స్పీకర్‌కు ఏం సంబంధం' అని తలసాని శ్రీనివాస్ యాదవ్ ప్రశ్నించారు.

# స్వాతంత్ర్య సిద్ధికి గాంధీ ప్రయోగించిన పదునైన అస్త్రం అహింస మాత్రమే..!

## ("గాంధీ జయంతి - అంతర్జాతీయ అహింస దినోత్సవం" సందర్భంగా)

వలస పాలకుల కబంధ హస్తాల్లోంచి భరతమాతకు స్వేచ్ఛా స్వాతంత్ర్యాలను ప్రసాదించడానికి అహింస, సత్య ధర్మాలు, సత్యాగ్రహం, సహనశీలత, స్వయం సమృద్ధి, స్వదేశీ వస్తు వినియోగం లాంటి పదునైన ఆయుధాలను ప్రయోగించి సఫలమైన జాతి పిత మహాత్మాగాంధీ ఆదర్శ జీవితం మనకే కాకుండా ప్రపంచ మానవాళి కూడా ఆదర్శంగా నిలిచింది, నేటికీ మనకు మార్గ దర్శనం చేస్తూనే ఉన్నది. 02 అక్టోబర్ 1869న పోర్‌బందర్‌లో జన్మించిన మోహన్‌దాస్ కరమ్‌చంద్ గాంధీ పాఠశాల విద్య అనంతరం ఇంగ్లాండ్‌లో బారిస్టర్ కోర్సు పూర్తి చేసిన పిదప దక్షిణ ఆఫ్రికాలో ప్రాక్టీస్ మొదలు పెట్టారు. దక్షిణ ఆఫ్రికాలో తాను చూసిన, అనుభవించిన జాతి వివక్ష పట్ల అహింసాయుత మార్గంలో వ్యతిరేకించారు, నాటి పౌర సమాజానికి ప్రేరణగా నిలిచారు. అతి సాధారణ జీవితాన్ని గడుపుతూ, ఉన్నత ఆలోచనలు చేస్తూ, సకల జీవుల పట్ల ఆదరణతో మన జీవితాలు కొనసాగాలని గాంధీ జీవితం సూచిస్తున్నది.

### పచ్చని పరిశుభ్ర స్వతంత్ర భారత నిర్మాణమే లక్ష్యం:

మనం సాధించిన స్వతంత్ర భారతాన్ని సుందరంగా, సుసంపన్నంగా మార్చడానికి మనం నిత్యం కృషి చేయాలని ఆయన పిలుపును ఇవ్వడం మనకు తెలుసు. స్వాతంత్ర్యం కన్న పారిశుధ్యమే మిన్న అని కూడా ఆయన పేర్కొనడం జరిగింది. పచ్చని పరిశుభ్ర భారత్ నిర్మాణంలో మనం భాగస్వాములమై దేశభక్తులుగా రుజువు చేసుకోవాలి కూడా ఆయన పిలుపును ఇచ్చారు.

మహాత్ముని కలలను సాకారం చేయడానికి కేంద్ర ప్రభుత్వం 'స్వచ్ఛ భారత్ మిషన్' అనబడే ప్రతిష్టాత్మక జాతీయ పథకాన్ని 02 అక్టోబర్ 2014న ప్రవేశపెట్టి విజయవంతంగా 02 అక్టోబర్ 2019న భారత్‌ను బహిరంగ మల మూత్ర విసర్జన రహిత దేశంగా మార్చడం, ప్రజారోగ్యానికి పట్టం కట్టడం మనకు తెలుసు. దేశ ఆర్థిక ప్రగతికి పరిసరాల పరిశుభ్రత, ప్రజారోగ్యం ముడిపడి ఉంటాయని గాంధీ ప్రచారం చేసారు. దేశ స్వాతంత్ర్యం అనంతరం హిందూ జాతీయతావాది నాథూరామ్ వినాయక్ గాడ్సే గాంధీని హత్య చేయడంతో 30 జనవరి 1948న కన్ను మూసారు. ఆయన చనిపోయిన రోజును "షహీది దివస్"గా కూడా నిర్వహించుకుంటున్నాం.

### జాతిపిత బోధించిన జీవిత విలువలు:

గాంధీ బోధనల్లో శాంతియుత సహజీవనం, నీతి నిజాయితీ, సింప్లిసిటీ, సామాజిక న్యాయం, దయ కరుణలు, సమానత్వం, స్వయం క్రమశిక్షణ, జాతీయ సమైక్యత, అహింస భావనలు, సమయం నియంత్రణ, పరమత సహనం, సమ న్యాయం, నిస్వార్థ జీవన విధానం, దేశాభివృద్ధికి తోడ్పాటు లాంటి సుగుణాలు పొందుపరుచబడ్డాయి. గాంధీ జయంతి రోజు విద్యాలయాల్లో గాంధీ జీవిత ఆధారంగా పలు పోటీల నిర్వహణ, సదస్సులు, సామాజిక చైతన్య కార్యక్రమాలు, నాటకాలు, దేశ భక్తి పునాదిగా సాంస్కృతిక కార్యక్రమాలు లాంటి పలు కార్యక్రమాలను యువత పరివర్తన కేంద్రంగా నిర్వహించవచ్చు. దేశ స్వాతంత్ర్య సాధనలో గాంధీ వినియోగించిన అహింస, స్వయం సమృద్ధి, సత్య ధర్మ విలువలే పదునైన ఆయుధాలుగా లక్ష్యాలను సాధించిన గాంధీ జీవితం మనకు నిత్య ప్రేరణ కావాలి.

మనకు నేటి డిజిటల్ యుగంలో కూడా ఆ విలువలు దారి దీపాలు రావాలి, దేశ భక్తి నరనరాన నిండిన యువభారతం దేశ సుస్థిరాభివృద్ధి యజ్ఞంలో సమిధలుగా మారాలని గాంధీ జీవితం బోధిస్తున్నది.



-మధుపాళీ
9949700037

# యూపీఎస్సీ శతాబ్ది ఉత్సవాలకు హాజరైన ప్రధాని శ్రీ నరేంద్ర మోదీ

న్యూ ఢిల్లీ, అక్టోబర్ 2:న్యూ ఢిల్లీలోని భారత్ మండపంలో ఈ రోజు నిర్వహించిన యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (యూపీఎస్సీ) శతాబ్ది ఉత్సవాల్లో ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ పాల్గొన్నారు. శతాబ్ది ఉత్సవాల వెనుక ఉన్న ఘనమైన వారసత్వాన్ని ప్రధానమంత్రి తన ప్రసంగంలో గుర్తుచేశారు. నిజానికి లక్షలాది యువత ఆశయాలకు, ప్రతి భారతీయుడికీ ఆ సంస్థపై ఉన్న అచంచలమైన విశ్వాసానికి ఈ వందేళ్ల వేడుక నిదర్శనమని ప్రధానమంత్రి కొనియాడారు. తరాలు, ప్రభుత్వాలు, సాంకేతికతలు, సిలబస్‌లు మారుతున్నా... యూపీఎస్సీ విశ్వసనీయతను నిలబెట్టుకున్న తీరును ఆయన ప్రశంసించారు. ఈ సందర్భంగా ప్రత్యేక స్మారక పోస్టల్ స్టాంపును, స్మారక నాణేన్ని, 100 కీలక తీర్పుల సంకలనాన్ని ఆవిష్కరించడంపై శ్రీ మోదీ హర్షం వ్యక్తం చేశారు.

స్వాతంత్ర్యానంతరం పెద్ద పెద్ద సవాళ్లు దేశం ఎదుట నిలిచిన తీరును గుర్తుచేశారు. స్వాతంత్ర్యాన్ని కాపాడుకోవడానికే కాకుండా, నూతనంగా రూపుదిద్దుకున్న దేశంలో సమర్థ పాలనను అందించడం లక్ష్యంగా అత్యంత కీలకమైన ఈ ఉక్కు చట్రాన్ని ఏర్పాటు చేసిన సర్దార్ వల్లభ భాయ్ పటేల్‌ను ప్రధానమంత్రి ఈ సందర్భంగా ప్రత్యేకంగా స్మరించుకున్నారు. స్వతంత్ర భారత దేశానికి కీలకమైన మూలాధారంగా ఈ సంస్థను తీర్చిదిద్ది... సశక్తంగా మలిచిన సర్దార్ పటేల్ కృషిని ఆయన ప్రశంసించారు. "దేశ పునర్నిర్మాణానికి అత్యావశ్యకమైన ఉక్కు చట్రాన్ని సర్దార్ పటేల్ అందించారు" అని శ్రీ మోదీ వ్యాఖ్యానించారు.

1926లో బ్రిటిష్ పాలన కాలంలో ఈ సంస్థ ఏర్పడిన విధానానికి, స్వాతంత్ర్యానంతరం యూపీఎస్సీ పరిణామ క్రమానికి నడుమ స్పష్టమైన వ్యత్యాస ముందని ప్రధానమంత్రి అన్నారు. స్వేచ్ఛాయుతమైన స్వతంత్ర భారత స్వప్నాలను సాకారం చేసే దిశగా తన ప్రాధాన్యాలను ఈ వ్యవస్థ విజయవంతంగా మలచుకుందన్నారు. చరిత్రాత్మకంగా యూపీఎస్సీ అత్యుత్తమంగా బాధ్యతలు నిర్వర్తించిందని, ఇక దేశం ముంగిట నిలిచిన రాబోయే 25 ఏళ్ల కీలక భవిష్యత్తుపై ఇప్పుడు ప్రధానంగా దృష్టి సారించాలని ఆయన వ్యాఖ్యానించారు. "అందుకే, ఈ రోజు నా ప్రసంగంలో ఈ అంశంపైనే ప్రధానంగా దృష్టి సారిస్తున్నాను" అని శ్రీ మోదీ స్పష్టం చేశారు.

వికసిత భారత్ సాధనలో ఎంపిక కమిషన్ల పాత్ర అత్యంత కీలకమైనదని వివరిస్తూ... ఈ రోజు నియమితులయ్యే యువత ఏకకాలంలో దేశ భవితను మలిచే శిల్పులుగాను, ప్రథమ లబ్ధిదారులుగాను ఉంటారని ప్రధానమంత్రి అన్నారు. దేశానికి, ప్రజలకు ప్రథమ ప్రాధాన్యమిచ్చే రెండంచెల ప్రాతిపదికన ప్రతి ఎంపిక ప్రక్రియలోనూ నిశితమైన పరీక్షలు ఉండాలని ఆయన నిర్దేశించారు. "ఈ భావన నిండిన అభ్యర్థులు ఎంపికైతే.. జాతీయ లక్ష్యాలను సాధించడం మరింత సహజంగా, సులభంగా మారుతుంది" అని శ్రీ మోదీ స్పష్టం చేశారు.

2047 నాటికి రూపుదిద్దుకోబోతున్న అత్యంత విభిన్నమైన సామాజిక - ఆర్థిక ముఖచిత్రాన్ని వివరిస్తూ... గ్రామీణ - పట్టణ వ్యత్యాసాలు తగ్గిపోతూ శరవేగంగా పట్టణీకరణ చెందుతున్న మన దేశంలో యువత ఆకాంక్షలు భారీగా పెరుగుతాయని ప్రధానమంత్రి వివరించారు. కృత్రిమ మేధ ఆధారంగా సత్వర, కచ్చితమైన పరిష్కారాలను ప్రజలు డిమాండ్ చేస్తున్న నేటి డిజిటల్ ప్రపంచంలో... ఆ వేగానికి అనుగుణంగా సేవలందించే పాత పద్ధతులు కూడా పరివర్తన చెందాలని ఆయన హెచ్చరించారు. "మారుతున్న ఈ ధోరణికి అనుగుణంగా మన సివిల్ సర్వీసుల్లో కూడా నూతన మార్పులు అనివార్యం" అని శ్రీ మోదీ అభిప్రాయపడ్డారు.

ఉద్యోగ నియామకాల దృక్పథంలో ప్రాథమిక మార్పులు రావాలని చెబుతూ... కేవలం అభ్యర్థుల విద్యా విషయక పరిజ్ఞానాన్ని మాత్రమే కాకుండా, వారిలోని అంతర్గత ప్రేరణను కూడా ఎంపిక ప్రామాణికాలతో అంచనా వేయాలని ప్రధానమంత్రి సూచించారు. దీనివల్ల అభ్యర్థులు కేవలం అధికారం పట్ల కాకుండా, ప్రజాసేవ పట్ల అంకితభావంతో ముందుకొస్తారని ఆయన వివరించారు. సరైన అంతర్గత ప్రేరణ ఉన్న వ్యక్తులను ఎంపిక చేయడం వల్ల.. అధికార యంత్రాంగాన్ని, శరవేగంగా మారుతున్న ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా మలచడం సులభతరమవుతుందన్నారు. "అందుకే భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా మన ఎంపిక ప్రమాణాలను, నియామక ప్రక్రియను మనం మార్చుకోవాలి" అని శ్రీ మోదీ స్పష్టం చేశారు.

కొత్తగా సివిల్ సర్వీసెస్‌లోకి వచ్చిన అధికారులతో వ్యక్తిగత అనుభవాలను పంచుకుంటూ... భవిష్యత్తులో సవాళ్లు, బాధ్యతలు పెరిగినప్పుడు తమను తాము సరిచూసుకునేలా ట్రైనీ అధికారులు ప్రాథమిక ఉద్దేశాలను రాసి పెట్టుకోవాలని ప్రధానమంత్రి సూచించారు. అభ్యర్థుల కోసం ఇలాంటి ఆత్మపరిశీలనా పద్ధతులను నెలకొల్పాలని యూపీఎస్సీ, రాష్ట్ర సర్వీస్ కమిషన్లను ప్రోత్సహించారు. "యూపీఎస్సీ, రాష్ట్ర కమిషన్లు కూడా ఇటువంటి వ్యవస్థ అభివృద్ధి గురించి యోచించాలి" అని శ్రీ నరేంద్ర మోదీ పేర్కొన్నారు.

గతంలోని 'మాయ్-బాప్' పాలనా విధానాన్ని విడనాడుతూ... 'నాగరిక్ దేవో భవ' సూత్రం ఆధారంగా ఆధునిక పాలనా యుగానికి ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ శ్రీకారం చుట్టారు. ప్రజాసేవే అన్నింటికంటే సర్వోన్నతమైనదని, అదే 21వ శతాబ్దపు పరిపాలనకు కీలక ఆధారమని అన్నారు. "దేశ పౌరుడు దేవుడి కంటే ఏమాత్రం తక్కువ కాదు" అని శ్రీ నరేంద్ర మోదీ స్పష్టం చేశారు.

ఆధునిక పరిపాలనలో నూతన పని సంస్కృతి గురించి చెబుతూ... 21వ శతాబ్దపు భారతదేశం పూర్తిగా సరికొత్త కార్యాచరణ స్ఫూర్తితో ముందుకు సాగుతోందని ప్రధానమంత్రి తెలిపారు. ఈ నూతన శకం ప్రాథమిక సూత్రాలు పూర్తిగా మూడు ప్రధాన అంశాలపై ఆధారపడి ఉన్నాయని చెప్పారు. "ప్రజా అనుకూల, ముందస్తుగా స్పందించగల, మెరుగైన పరిపాలన అనే మూడు ప్రాథమిక సూత్రాలు" అని శ్రీ నరేంద్ర మోదీ తెలిపారు.

ఈ ప్రాథమిక పాలనా సూత్రాలను మరింత వివరిస్తూ... జాతీయ, రాష్ట్ర స్థాయిల్లో ఎంపిక ప్రక్రియలు ఎలాంటి అనవసరమైన ఒత్తిళ్లు, ప్రభావాలకు లోనుకాకుండా, సమస్యలను ముందుగానే ఊహించి పనిచేసే నిపుణులను ఎంపిక చేసేలా అత్యంత పకడ్బందీగా రూపొందించుకోవాలని ప్రధానమంత్రి కోరారు. సమస్యలకు వినూత్న పరిష్కారాలను చూపుతూ, ప్రజల జీవనశైలిని సులభతరం చేస్తూ, చట్టాలు ప్రజలపై చూపే ప్రభావాన్ని నిశితంగా అంచనా వేసే సానుభూతిపరులైన సివిల్ సర్వెంట్ల అవసరాన్ని తెలిపారు. "కఠినమైన సమస్యల నుంచి వినూత్న మార్గాల ద్వారా బయట పడే నిపుణులను మనం దేశానికి అందించాలి" అని శ్రీ నరేంద్ర మోదీ అన్నారు.

సమాజం ఎదుర్కొంటున్న సాంకేతిక సవాళ్లను ప్రస్తావిస్తూ... ఇన్ఫర్మేషన్ వార్‌ఫేర్, డీప్‌ఫేక్‌లు, అల్గారిథమిక్ వివక్ష, పర్యావరణ సమతుల్యత వంటి సరికొత్త రణరంగాలను భవిష్యత్ సివిల్ సర్వెంట్లు ఎదుర్కోవాల్సి ఉంటుందని ప్రధానమంత్రి హెచ్చరించారు. అభ్యర్థుల దూరదృష్టికి, క్లిష్టమైన సమస్యలను పరిష్కరించే నైపుణ్యాలకు ప్రాధాన్యతనిస్తూ, ఈ ప్రపంచ మార్పులకు తగినట్లుగా మారాలని నియామక సంస్థలను ఆదేశించారు. "ఇటువంటి పరిస్థితుల్లో ఎంపిక ప్రక్రియలో మనం క్లిష్టమైన సమస్యలను పరిష్కరించే సామర్థ్యాన్ని, దూరదృష్టిని పరీక్షించటానికే అధిక ప్రాధాన్యతనివ్వాల్సి ఉంటుంది" అని శ్రీ నరేంద్ర మోదీ స్పష్టం చేశారు.

పాలనాపరమైన సంస్కరణల ఆవశ్యకతను తెలియజేస్తూ... పరీక్షల నిర్వహణ సంస్థలు దేశ విస్తృత సంస్కరణల ధోరణికి అనుగుణంగా వేగంగా మారాలని ప్రధానమంత్రి స్పష్టం చేశారు. ప్రమాణాలను తగ్గించకుండా పరీక్షా ప్రక్రియను వేగవంతం చేయాలని, దీని కోసం 'నిర్దిష్ట కాలపరిమితి' సూత్రం పాటించాలన్నారు. సుదీర్ఘంగా సాగే పరీక్షల సమయం వల్ల కుటుంబాలపై కోచింగ్ ఫీజులు, అద్దెలు, రవాణా వంటి తీవ్రమైన ఆర్థిక భారం పడుతుందన్నారు. పరీక్షా ప్రక్రియల కాలాన్ని కుదించటం కేవలం పరిపాలనాపరమైన అంశం మాత్రమే కాక ప్రాథమికమైన సమన్యాయ సంస్కరణగా మారుతుందన్నారు. "ఇది ఒక సామాజిక సమన్యాయ సంస్కరణ అవుతుంది" అని శ్రీ నరేంద్ర మోదీ అన్నారు.

వ్యవస్థాపక సంస్థాగత సామర్థ్యాన్ని క్రమపద్ధతిలో పెంపొందించటాన్ని ప్రోత్సహిస్తూ, రాష్ట్ర కమిషన్లు ఉత్తమ పద్ధతులను పంచుకునే జాతీయ సదస్సులను ప్రధానమంత్రి ప్రశంసించారు. అంతర్జాతీయ ప్రమాణాలను అధ్యయనం చేయటం ద్వారా, సాంకేతిక సామర్థ్యంపై దృష్టి పెట్టడం ద్వారా ఈ వేదికలను మరింత ఉన్నత స్థాయికి తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. దేశవ్యాప్తంగా పాల్గొంటున్న యువతకు ఎంతో ఉపశమనాన్ని, స్పష్టతను అందించేందుకు పరస్పర అభ్యాసం, విధానాలను ప్రామాణీకరించటం ముఖ్యమని సూచించారు. "ఈ పరస్పర అభ్యాస ప్రక్రియ యూపీఎస్సీకి, ప్రతి రాష్ట్రంలోని సెలక్షన్ కమిషన్లకు కూడా ప్రయోజనం చేకూరుస్తుంది" అని శ్రీ నరేంద్ర మోదీ తెలిపారు. నిరంతర సంస్థాగత వృద్ధి అవసరమని స్పష్టం చేస్తూ... యూపీఎస్సీ, రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్లు సామర్థ్యాలను పెంపొందించుకోవటంపై దృష్టి సారించాలని ప్రధానమంత్రి సూచించారు. సివిల్ సర్వీసుల జాతీయ మిషన్ ద్వారా ఇప్పటికే ఏర్పాటైన డిజిటల్ మౌలిక సదుపాయాలను విస్తృతంగా వినియోగించుకోవాలని సిఫార్సు చేశారు. "మిషన్ కర్మయోగి ద్వారా రూపొందించిన ఐ-గాట్ వేదికను ఇందు కోసం ఉపయోగించుకోవచ్చు" అని శ్రీ నరేంద్ర మోదీ పేర్కొన్నారు.




# ప్రతి ఒక్కరూ ప్రకృతిని ఆస్వాదించాలి..

ఆదిలాబాద్, అక్టోబర్ 2: వన్యప్రాణి వారోత్సవాల (సప్తాహోత్సవం) సందర్భంగా ప్రతి ఒక్కరూ ప్రకృతి ప్రాముఖ్యతను గుర్తించి ఆస్వాదించాలని జన్నారం అటవీ డివిజనల్ అధికారి (ఎఫ్డీఓ) ఎం. రామ్మోహన్ పిలుపునిచ్చారు. 7 రోజుల పాటు నిర్వహించే ఈ ఉత్సవాల్లో భాగంగా తొలిరోజు శుక్రవారం కవ్వాల టైగర్ రిజర్వ్ పరిధిలోని జన్నారం అటవీ శ్రేణి గొండుగూడ గేటు నెంబరు-1 వద్ద అటవీశాఖ ఆధ్వర్యంలో 'ప్రకృతి నడక' (నేచర్ వాక్) కార్యక్రమాన్ని ఎఫ్డీఓ ప్రారంభించారు.

ఈ సందర్భంగా హాజరైన ప్రతినిధులు, సిబ్బంది అడవిలో దాదాపు 4 కిలోమీటర్ల మేర కాలినడకన సాగారు. ప్రశాంతమైన వాతావరణంలో స్వచ్ఛమైన ఆక్సిజన్ పీలుస్తూ, అటవీ ప్రాంతంలోని వివిధ రకాల వృక్షాలు మరియు పక్షులను సందర్శకులు తిలకించి తమ కెమెరాల్లో బంధించారు. ఈ సందర్భంగా ఎఫ్డీఓ మాట్లాడుతూ.. మానవాళి మనుగడకు అడవులు, వన్యప్రాణులు ఎంతో అవసరమని పేర్కొన్నారు. అడవిలోని పెద్ద పులులు, చిరుత పులులు, ఇతర జీవరాశుల ప్రాముఖ్యతను, వృక్షజాతుల విశిష్టతను ఆయన పాల్గొన్న వారికి సమగ్రంగా వివరించారు. ఈ కార్యక్రమంలో జన్నారం ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ (ఎఫ్ ఆర్ ఓ) బాబా ఖాదర్ వాలీ, డిప్యూటీ ఆర్ఓ పి. మమత, ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ రవి నాయక్ మరియు పలువురు అటవీశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

# విద్యుత్ షాక్‌తో రైతు దంపతుల మృతి

### యమపాశాలుగా మారిన కరెంటు తీగలు

ఆదిలాబాద్, అక్టోబర్ 2: రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మండల కేంద్రానికి చెందిన రైతు దంపతులు గంట దేవయ్య (58), గంట లక్ష్మి (52) విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందిన ఘటన శుక్రవారం వెలుగులోకి వచ్చింది. గురువారం సాయంత్రం పొలం వద్దకు వెళ్లిన వారు ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందినట్లు స్థానికులు భావిస్తున్నారు. పొలంలో కోతులు, పందుల బెడద నివారణకు దేవయ్య పొలం చుట్టూ ఫెన్సింగ్ వైరు ఏర్పాటు చేసి విద్యుత్ కనెక్షన్ ఇచ్చినట్లు స్థానికులు చెబుతున్నారు.

అదే వైరు కారణంగా దంపతులు విద్యుత్ షాక్‌కు గురైనట్లు అనుమానిస్తున్నారు. అటుగా వెళ్లిన స్థానికులు విగత జీవులుగా ఉన్న దంపతులను గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న ఎస్సై సీహెచ్. శ్రీకాంత్ సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని పరిశీలించారు. అనంతరం మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం జిల్లా ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఘటనపై పోలీసులు దర్యాప్తు చేపట్టారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

# వన్యప్రాణుల సంరక్షణపై అవగాహన..

### ఖానాపూర్‌లో వన్యప్రాణి వారోత్సవాలు ప్రారంభం



ఆదిలాబాద్, అక్టోబర్ 2: వన్యప్రాణి వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం నిర్మల్ జిల్లా ఖానాపూర్ అటవీశాఖ ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఎఫ్ డీ వో కడారి అనిత జెండా జెండా ఊపి ర్యాలీ ప్రారంభించారు. అటవీశాఖ అధికారులు, సిబ్బంది కార్యాలయం నుండి కొమురం భీం చౌరస్తా మీదుగా తర్లపాడు, సత్తెనపల్లి, దిలావర్పూర్, ఖానాపూర్ వరకు ర్యాలీ చేపట్టి వన్యప్రాణులు, అడవుల సంరక్షణపై ప్రజలకు అవగాహన కల్పించారు. అంతకు ముందు ఎన్టీఆర్ చౌరస్తా, తర్లపాడులో మానవహారం పాటించి వన్య ప్రాణుల మనుగడ పెంపొందించాలని అవగాహన కల్పించారు. అడవులను, వన్యప్రాణులను కాపాడుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని, జీవ వైవిధ్య పరిరక్షణకు కృషి చేయాలని అధికారులు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఖానాపూర్ ఎఫ్ డీ వో కడారి అనిత మాట్లాడుతూ.. వన్యప్రాణులను హతమార్చినట్లు తమ దృష్టికి వస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. వన్యప్రాణుల మనుగడకు ప్రతి ఒక్కరు కృషి చేస్తూ అటవీ శాఖ సిబ్బందికి సహకరించాలని కోరారు. అక్టోబర్ 2 నుండి 8 వరకు ఈ వారోత్సవాలు కొనసాగుతాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఖానాపూర్ ఎఫ్ ఆర్ వో కిరణ్ కుమార్, ఖానాపూర్ డివిజన్ పరిధిలోని కడెం, పెంబి, దస్తురాబాద్, మామడ మండలాల ఎఫ్ ఎస్ వో లు, బీట్ అధికారులు, అటవీ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

# మహాత్మాగాంధీ జీవన విధానం ప్రతి ఒక్కరికి ఆదర్శం

### గాంధీ ఆదర్శాలను భావితరాలకు అందించాలి..జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష



కరీంనగర్, అక్టోబర్ 2: మహాత్మాగాంధీ జీవన విధానం ప్రతి ఒక్కరికి ఆదర్శమని పెద్దపల్లి జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష అన్నారు. శుక్రవారం పెద్దపల్లి సమీకృత జిల్లా కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో జాతిపిత మహాత్మా గాంధీ జయంతిని పురస్కరించుకుని జ్యోతి ప్రజ్వలన చేసి గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నేటి సమాజంలో మనందరం తొందరగా ఫలితాలు రావాలని ఆశిస్తున్నామని, గాంధీ జీవితంలో ఎప్పుడు షార్ట్ కట్స్ వెతుక్కోలేదని, న్యాయబద్ధంగా ఓపికతో పోరాడుతూ అనేక విజయాలు సాధించారన్నారు. స్వాతంత్ర ఉద్యమంలో భాగంగా జరిగిన క్విట్ ఇండియా, విదేశీ వస్త్రాల బహిష్కరణ మొదలగు ఉద్యమాలు ఒక్కరోజులో వచ్చినవి కావని, గాంధీ మహనీయులు ప్రతి రోజూ నమ్మిన సిద్ధాంతం ప్రకారం నిరంతరాయంగా చేసిన కృషి ఫలితంగా ఉద్యమాలు సఫలీకృతం అయ్యాయని, ఒక్కరోజులో ఫలితం రాలేదన్నారు. స్వాతంత్ర ఉద్యమంలో గాంధీ జైలు శిక్ష అనుభవించడం వంటి అనేక కష్టాలు ఎదుర్కొన్నప్పటికీ, లక్ష్యాన్ని సిద్ధాంతాన్ని మరిచిపోకుండా పోరాటం సాగించారని గుర్తు చేశారు. దాని వల్ల ఆశించిన ఫలితం లభించి మన దేశానికి స్వాతంత్రం వచ్చిందని, దీనిని నేటి యువత ఆదర్శంగా తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు, కలెక్టరేట్ ఏఓ బండి ప్రకాష్, వివిధ శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

# ఖమ్మం కార్పొరేషన్‌లో డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షులు ఖరారు

ఖమ్మం, అక్టోబర్ 2: ఖమ్మం కార్పొరేషన్‌లోని 60 డివిజన్లకు కాంగ్రెస్ అధ్యక్షులు, డివిజన్‌కు 20 మంది చొప్పున కార్యవర్గాలను ఖరారు చేశారు. ఖమ్మం అర్బన్ డీసీసీ అధ్యక్షుడు నాగండ్ల దీపక్‌చౌదరి గురువారం హైదరాబాద్‌లో టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్ చేతుల మీదుగా నియామక పత్రాలను ఆవిష్కరించి విడుదల చేశారు. ఖమ్మం అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలోని 57 డివిజన్లతో పాటు పాలేరు నియోజకవర్గ పరిధిలోని మూడు డివిజన్లకు అధ్యక్షులు, కార్యవర్గాలను నియమించారు.

ఈ సందర్భంగా నూతనంగా నియమితులైన డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షులు, కమిటీ సభ్యులకు మహేష్‌కుమార్‌గౌడ్, మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకుడు తుమ్మల యుగంధర్, అర్బన్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు నాగండ్ల దీపక్‌చౌదరి శుభాకాంక్షలు తెలిపారు. కాంగ్రెస్ పార్టీని డివిజన్ స్థాయి నుంచి మరింత బలోపేతం చేయడంతో పాటు ప్రజా సమస్యల పరిష్కారం కోసం క్షేత్రస్థాయిలో నిరంతరం పనిచేయాలని ఆకాంక్షించారు.

# 'స్వచ్ఛ భారత్' ప్రజల భాగస్వామ్యంతో సాగుతున్న ఉద్యమం...

### పరిశుభ్రత నిరంతర బాధ్యత: పీఐబీ హైదరాబాద్ ఏడీజీ శ్రీమతి శ్రుతి పాటిల్



న్యూ ఢిల్లీ, అక్టోబర్ 2:హైదరాబాద్‌లోని కవాడిగూడ సీజీఓ టవర్స్ ప్రాంగణం గురువారం స్వచ్ఛతా కార్యక్రమానికి వేదికగా మారింది. "స్వచ్ఛతా వే సహభాగ్-స్వచ్ఛ భారత్, వికసిత్ భారత్" ఇతివృత్తంతో చేపట్టిన "స్వచ్ఛతా హీ సేవా?2026"లో భాగంగా దేశవ్యాప్తంగా చేపట్టిన "ఏక్ దిన్, ఏక్ ఘంటా, ఏక్ సాథ్" శ్రమదానంలో హైదరాబాద్‌లోని పత్రికా సమాచార కార్యాలయం (పీఐబీ), సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్ (సీబీసీ) అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీజీఓ టవర్స్ పరిసరాల్లో శ్రమదానం కార్యక్రమంలో పాల్గొని పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు.

ఈ కార్యక్రమంలో పాల్గొన్న అదనపు డైరెక్టర్ జనరల్ శ్రీమతి శ్రుతి పాటిల్ ఐఐఎస్ మాట్లాడుతూ... స్వచ్ఛ భారత్ మిషన్ ప్రజల భాగస్వామ్యంతో ముందుకు సాగుతున్న ఉద్యమంగా ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ అభివర్ణించిన విషయాన్ని గుర్తుచేశారు. పరిశుభ్రత అనేది ఒక్కరోజు కార్యక్రమంగా కాకుండా ప్రతిరోజూ కొనసాగించాల్సిన బాధ్యత అని ఆమె అన్నారు. పరిశుభ్రతను తమ రోజువారీ జీవితంలో ఒక భాగంగా చేసుకోవాలని అధికారులు, సిబ్బందికి పిలుపునిచ్చారు.

సీజీఓ టవర్స్ ప్రాంగణాన్ని పరిశుభ్రంగా, ఆరోగ్యకరంగా ఉంచడంలో కీలకంగా వ్యవహరిస్తున్న పారిశుధ్య కార్మికుల సేవలను శ్రీమతి శ్రుతి పాటిల్ అభినందించారు. వారి అంకితభావంతో కూడిన సేవలకు గుర్తింపుగా గ్లౌవ్స్, శానిటేషన్ కిట్లను అందజేశారు.

ఈ సందర్భంగా ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ ప్రారంభించిన 'ఏక్ పేడ్ మా కే నామ్' కార్యక్రమంలో భాగంగా సీజీఓ టవర్స్ ప్రాంగణంలో మొక్కలు నాటారు. అదనపు డైరెక్టర్ జనరల్ శ్రీమతి శ్రుతి పాటిల్ ఐఐఎస్‌తో పాటు పీఐబీ, సీబీసీ హైదరాబాద్ అధికారులు, సిబ్బంది ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. పర్యావరణ పరిరక్షణతో పాటు పచ్చదనాన్ని పెంచే లక్ష్యంతో వారు ఈ కార్యక్రమాన్ని చేపట్టారు.

# హైదరాబాద్‌లోని ఎగుమతిదారుల కోసం కస్టమ్స్ పథకాలపై కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న ఎఫ్ఐఈఓ

న్యూ ఢిల్లీ, అక్టోబర్ 2: "ఎగుమతిదారుల కోసం కస్టమ్స్ పథకాలు: ప్రయోజనాలు, విధానాలు, నిబంధనలు" పేరతో ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఎక్స్‌పోర్ట్ ఆర్గనైజేషన్స్ (ఎఫ్ఐఈఓ) ఒక కార్యక్రమాన్ని నిర్వహించనుంది. ఐసీఐసీఐ బ్యాంకు సహకారంతో అక్టోబర్ 9, 2026 (శుక్రవారం)న హైదరాబాద్‌లో ఈ కార్యక్రమం జరుగుతుంది.

ఎగుమతిదారులు, తయారీదారులు, ఎంఎస్ఎంఈలు, వాణిజ్య భాగస్వాములకు అంతర్జాతీయ వాణిజ్యానికి అందుబాటులో ఉన్న కీలక కస్టమ్స్ పథకాలు, సులభతర చర్యలపై అవగాహన కల్పించడమే ఈ కార్యక్రమం లక్ష్యం. ఇందులో ముఖ్యంగా ప్రయోజనాలు, అర్హత, విధానాలు, డాక్యుమెంటేషన్, నిబంధనలు పాటించటం వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారిస్తారు.

ఎగుమతిదారుల కోసం కస్టమ్స్ సులభతరం చేసే విధానాలపై సమీక్ష, ఎగుమతుల ప్రోత్సాహంలో కస్టమ్స్ పాత్ర, ఐస్‌గేట్, ఎలక్ట్రానిక్ కస్టమ్స్ విధానాలు, రిస్క్ మేనేజ్‌మెంట్ సిస్టమ్, ఫేస్‌లెస్ అసెస్‌మెంట్.

డ్యూటీ ఫ్రీ దిగుమతి పథకాలు, అడ్వాన్స్ ఆథరైజేషన్, డ్యూటీ ఫ్రీ ఇంపోర్ట్ ఆథరైజేషన్, అర్హత, నిబంధనలు, దరఖాస్తు, డాక్యుమెంటేషన్.

ఎక్స్‌పోర్ట్స్ ప్రమోషన్ క్యాపిటల్ గూడ్స్ (ఈపీసీజీ) పథకంతో పాటు రాయితీ, పన్ను లేకుండా క్యాపిటల్ వస్తువుల దిగుమతి, ఎగుమతి బాధ్యతలు, విధానాలు, నిబంధనలు.

ప్రత్యేక కస్టమ్స్ విధానాలు, సౌలభ్యంతో పాటు బాండెడ్ తయారీ, వేర్‌హౌసింగ్, బాండ్, ఎల్‌యూటీ ద్వారా ఎగుమతులు, కస్టమ్స్ వేర్‌హౌసింగ్ నిబంధనలు.

అర్హత గల తయారీదారుల పథకం, ఏఈఓ, కస్టమ్స్ సౌలభ్యం, అర్హత గల తయారీదారులు, ఎగుమతిదారులకు కలిగే ప్రయోజనాలు, అనుసరించాల్సిన విధానాలు.

ఎగుమతిదారుల కోసం కస్టమ్స్ సౌలభ్యం, షిప్పింగ్ బిల్లు, సపోర్టింగ్ డాక్యుమెంట్లు, వర్గీకరణ, వాల్యుయేషన్, దేశీయ అవసరాలు, రికార్డుల నిర్వహణ, ఆడిట్, సాధారణ తప్పులు, జరిమానాలు.

డిజిటల్ కస్టమ్స్, ఐస్‌గేట్ సేవలు, ఇంటరాక్టివ్ ప్రశ్నలు-సమాధానాలు, కేస్‌స్టడీస్.

ఈ అంశాలపై హైదరాబాద్ కస్టమ్స్ కమిషనరేట్ సీనియర్ అధికారులు సమగ్రంగా ప్రజెంటేషన్లు ఇస్తారు. కస్టమ్స్ విధానాలు, నిబంధనలకు సంబంధించి ఆచరణాత్మక సమస్యల పరిష్కారంపై చర్చలు జరుగుతాయి. ఈ కార్యక్రమంలో బ్యాంకు అధికారులు కూడా పాల్గొని ఆర్థిక అవకాశాల గురించి వివరిస్తారు.

ఈ కార్యక్రమంలో పాల్గొనే వారికి కస్టమ్స్ పథకాలపై ఆచరణాత్మక అవగాహనను కల్పిస్తామని ఎఫ్ఐఈఓ డైరెక్టర్ జనరల్ శ్రీ ఉన్నికృష్ణన్ తెలిపారు. అందుబాటులో ఉన్న సదుపాయాలను సమర్థవంతంగా వినియోగించుకునేందుకు అవసరమైన విధానాలు, డాక్యుమెంటేషన్ గురించి స్పష్టమైన అవగాహన ఏర్పడుతుందని చెప్పారు.

# 'స్వచ్ఛతా హీ సేవా-2026'లో భాగంగా పరిశుభ్రత ఉద్యమానికి సారథ్యం వహించిన కేంద్ర మంత్రి శ్రీ జి. కిషన్ రెడ్డి

న్యూ ఢిల్లీ, అక్టోబర్ 2:'స్వచ్ఛతా హీ సేవా-2026'లో భాగంగా అక్టోబర్ 1న చాణక్యపురిలోని యశ్వంత్ ప్యాలెస్ మార్కెట్టులో నిర్వహించిన శుభ్రత కార్యక్రమంలో కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి శ్రీ జి.కిషన్ రెడ్డి పాల్గొన్నారు. బొగ్గు మంత్రిత్వ శాఖ కార్యదర్శి శ్రీ కేశవ్ చంద్రతో పాటు మంత్రిత్వ శాఖ, ఎన్‌డీఎమ్‌సీల సీనియర్ అధికారులు కూడా ఈ కార్య క్రమంలో పాలుపంచుకున్నారు. గాంధీ జయంతికి ఒక రోజు ముందు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.

కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి శ్రీ జి. కిషన్ రెడ్డి పారిశుధ్య కార్మికులతో మాట్లాడారు. బహిరంగ స్థలాలను నిర్మలంగా ఉంచడానికి వారు అంకిత భావంతో సేవలను అందిస్తున్నారని ఆయన ప్రశంసించారు. స్వచ్ఛత పరిరక్షణ అందరి బాధ్యత అని, పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా అట్టిపెట్టుకోవడంలో అందరూ చురుకుగా తోడ్పాటును అందించాలని ఆయన స్పష్టం చేశారు.



కాలువలు, ఆరుబయలు ప్రదేశాలు, రహదారులు, చెరువుల్లో చెత్తను పారవేయొద్దని, భవనాల్లో లేదా ఇతర చోట్ల నుంచి వ్యర్థాలను తీసుకువచ్చి ఎక్కడ పడితే అక్కడ విసరి వేయడం మానుకోవాలని పౌరుల కు మంత్రి పిలుపునిచ్చారు. శుద్ధతను కాపాడుకోవాలంటే సామూహిక జాగరూకతతో పాటు నిరంతర ప్రాతిపదికన ప్రజల భాగస్వామ్యం ఎంతయినా అవసరమని ఆయన ఉద్బోధించారు.

రోజూ తెల్లవారు ఝామునే పనులు మొదలుపెట్టి, ప్రజలకు పరిశుభ్రమైన పరిసరాలను అందించడానికి పాటుపడే పారిశుధ్య సిబ్బంది సేవలను గుర్తించి, గౌరవించుకోవడం ముఖ్యమని శ్రీ జి. కిషన్ రెడ్డి ప్రస్తావించారు. స్వచ్ఛతను నిత్య జీవితంలో ఓ విడదీయరాని భాగంగా మార్చుకోవడం కోసం మరింత ఎక్కువ మంది ముందుకు రావాలని ఆయన కోరారు.

కార్యక్రమంలో భాగంగా, "ఏక్ పేడ్ మా కే నామ్" (అమ్మ పేరిట ఒక మొక్క) ను కూడా చేపట్టారు. మొక్కలను నాటే కార్యక్రమంలో కేంద్ర మంత్రి, గనుల శాఖ కార్యదర్శితో పాటు సీనియర్ అధికారులు పాల్గొన్నారు. పర్యావరణ పరిరక్షణ ఒక బాధ్యత.. పరిసరాలను శుభ్రంగా, పచ్చదనంతో నిండి ఉండేలా చేసుకోవడానికి ప్రాధాన్యాన్ని ఇవ్వాలన్న సందేశాన్ని ఈ కార్యక్రమం చాటింది.

స్వచ్ఛతా హీ సేవా భావనతో పాటు, బహిరంగ స్థలాలను శుభ్రంగా ఉంచాలని, స్వచ్ఛ హరిత భారత్‌ను ఆవిష్కరించే దిశగా తోడ్పడడానికి ఉమ్మడి కార్యకలాపాలను కొనసాగించవలసిన అవసరం ఎంతైనా ఉందని ఈ కార్యక్రమం ద్వారా సూచించారు.

పారిశుధ్య కార్మికులు, అధికారులు సహా ఆసక్తిదారులంతా చొరవ తీసుకుని స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో తలో చేయి వేసినందుకు కేంద్ర మంత్రి ధన్యవాదాలు తెలిపారు.

# అసాధారణంగా తక్కువ బిడ్‌లు నమోదైన ప్రాజెక్టుల్లో ప్రత్యేక నాణ్యతా తనిఖీలు నిర్వహించనున్న ఎన్‌హెచ్ఏఐ

న్యూ ఢిల్లీ, అక్టోబర్ 2:జాతీయ రహదారి ప్రాజెక్టుల నిర్మాణ సమయంలో నాణ్యత నియంత్రణను, అత్యున్నత నాణ్యతా ప్రమాణాలను పాటించడాన్ని బలోపేతం చేయడం లక్ష్యంగా నిర్మాణంలో ఉన్న 17 జాతీయ రహదారి ప్రాజెక్టుల్లో నేషనల్ హైవేస్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఎన్‌హెచ్ఏఐ) ప్రత్యేక నాణ్యతా తనిఖీలు నిర్వహిస్తోంది. ఈ ప్రాజెక్టుల బిడ్ విలువ, అంచనా ప్రాజెక్ట్ వ్యయం కంటే 15 శాతానికి పైగా తక్కువగా ఉంది. ఎన్‌హెచ్ఏఐ సాధారణ నాణ్యతా తనిఖీలకు అదనంగా ఈ తనిఖీలు జరుగుతున్నాయి. నాణ్యతకు సంబంధించిన ఏవైనా సమస్యలను ప్రారంభ దశలోనే గుర్తించి, సకాలంలో దిద్దుబాటు చర్యలు తీసుకోవడమే వీటి ముఖ్య ఉద్దేశం. మొదటి విడత తనిఖీలు డిసెంబర్ 2026 నాటికి పూర్తి కావాల్సి ఉంది. నాణ్యత, నిర్మాణ ప్రమాణాలను పాటించడాన్ని నిర్ధారించుకోవడానికి, గుర్తించిన ప్రాజెక్టులను 6 నెలల తర్వాత మరో నిపుణుల బృందంతో ఎన్‌హెచ్ఏఐ తిరిగి తనిఖీ చేస్తుంది.

రూ.500 కోట్లకు పైబడిన నిర్మాణ వ్యయం, 15 శాతానికి పైగా టెండర్ విలువ తగ్గింపు, 35 శాతం నుంచి 80 శాతం మధ్య భౌతిక పురోగతి అనే మూడు ప్రమాణాల ఆధారంగా తనిఖీల కోసం 17 ప్రాజెక్టులను ఎంపిక చేశారు. నిర్మాణంలో కీలక దశలో ఉన్న ప్రాజెక్టుల నాణ్యతా తనిఖీలపై దృష్టి సారిస్తూ... నిష్పాక్షికమైన, డేటా ఆధారిత విధానాన్ని అవలంబించడానికి ఈ ప్రమాణాలు సహాయపడతాయి.

కర్ణాటక, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, పంజాబ్, హర్యానా, గుజరాత్, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాల్లోని గ్రీన్‌ఫీల్డ్, యాక్సెస్-నియంత్రిత కారిడార్లు, బైపాస్‌లు సహా నాలుగు, ఆరు వరుసల విస్తరణ పనులూ ఈ ప్రాజెక్టుల్లో భాగంగా ఉన్నాయి.

నాణ్యతా యంత్రాంగ బలోపేతం, నిబంధనల పాటింపును నిర్ధారించడం లక్ష్యంగా ఎన్‌హెచ్ఏఐ నిపుణుల బృందాలను ఏర్పాటు చేసింది. రహదారి రవాణా, జాతీయ రహదారుల మంత్రిత్వ శాఖ, రైల్వే మంత్రిత్వ శాఖ, రక్షణ మంత్రిత్వ శాఖ, రాష్ట్ర ప్రజా పనుల శాఖలు సహా వివిధ ప్రభుత్వ సంస్థలకు చెందిన 39 మంది అనుభవజ్ఞులైన, విశ్రాంత ఇంజనీర్ల నేతృత్వంలోని ప్రత్యేక బృందాలు ఈ తనిఖీలను నిర్వహిస్తాయి. తనిఖీల సమయంలో సాంకేతిక నిపుణులూ ఈ బృందాలకు సహకారం అందిస్తారు.

ఆమోదించిన డ్రాయింగ్‌లు, సాంకేతిక నిర్దేశాలు, ఒప్పంద షరతులు, ప్రాజెక్ట్-నిర్దిష్ట నాణ్యతా ప్రణాళికలకు అనుగుణంగా నిర్మాణ పనులను నిపుణుల బృందాలు తనిఖీ చేస్తాయి. వారు నిర్మాణ సామగ్రి నాణ్యత, పనితనం, నిర్మాణ పద్ధతులతో పాటు సేకరించిన నమూనాలు, పరీక్షల రికార్డులనూ పరిశీలిస్తారు.

వర్తించే చోట... రహదారి భద్రతా చర్యలు, ట్రాఫిక్ నిర్వహణ, పర్యావరణ పరిరక్షణ చర్యలూ ఈ తనిఖీల్లో భాగంగా ఉంటాయి. అవసరమైన ప్రమాణాలకు అనుగుణంగా లేని ఏ పనినైనా గుర్తించి, వర్తించే ఒప్పంద నిబంధనల ప్రకారం సవరణ చర్యల కోసం తదుపరి చర్యలు చేపడతారు.

సాధారణ నాణ్యతా సమస్యలను, నిర్మాణ పద్ధతులను... కాంట్రాక్టర్లు, కన్సల్టెంట్లు, ఇతర ప్రాజెక్ట్ భాగస్వాముల నుంచి అధిక జవాబుదారీతనం అవసరమయ్యే రంగాలను గుర్తించడంలో ఈ ప్రత్యేక తనిఖీలు ఎన్‌హెచ్ఏఐకి సహాయపడతాయి.

దేశవ్యాప్తంగా ప్రపంచ స్థాయి జాతీయ రహదారి నెట్‌వర్క్‌ను అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో... కొనసాగుతున్న జాతీయ రహదారి ప్రాజెక్టుల నాణ్యత పర్యవేక్షణను బలోపేతం చేయడానికి, సకాలంలో దిద్దుబాటు చర్యలు తీసుకునేలా చూడటానికి ఎన్‌హెచ్ఏఐ కొనసాగిస్తున్న నిరంతర ప్రయత్నాల్లో ఈ కార్యక్రమం ఒక భాగం.

# 'పీఆర్ఐపీ' తొలి విడత కింద 1,600 కోట్లతో 41 ఫార్మా-మెడ్‌టెక్ ఆవిష్కరణ ప్రాజెక్టులకు ఆమోదం

న్యూ ఢిల్లీ, అక్టోబర్ 2:భారత "ఫార్మా-మెడ్‌టెక్ రంగ పరిశోధన-ఆవిష్కరణల ప్రోత్సాహక కార్యక్రమం" (పీఆర్ఐపీ) తొలివిడత కింద దాదాపు -1,600 కోట్ల ఆర్థిక సహాయం అందించేలా 41 ప్రాజెక్టులకు ఆమోద ముద్ర పడింది. దీనికి అదనంగా ఈ ప్రాజెక్టుల ద్వారా అదనంగా -3,020 కోట్ల ప్రైవేట్ పెట్టుబడులు కూడా వస్తాయని అంచనా. అంటే- ఈ ప్రాజెక్టులలో మొత్తం పరిశోధన- అభివృద్ధి రంగంలో మొత్తం పెట్టుబడులు -4,620 కోట్లకు చేరుతాయి. ప్రస్తుతం ఆమోదం పొందిన ఈ ప్రాజెక్టులతో సరికొత్త ఔషధాల ఆవిష్కరణ, క్లినికల్ అభివృద్ధి, వినూత్న వైద్య సాంకేతికతలు సహా ఆవిష్కరణల విలువ వ్యవస్థ మరింత విస్తృతమవుతుంది.

ఇప్పటివరకు ఆమోదించిన 41 ప్రాజెక్టులలో 12 ప్రారంభ దశలో ఉండగా, 29 తదుపరి దశకు చేరాయి. వీటిలో 19 ప్రాజెక్టులను అంకుర సంస్థలు, 'ఎంఎస్ఎంఈ'ల చేపట్టా, మిగిలిన 22 పెద్ద కంపెనీల చేతిలో ఉన్నాయి. ప్రాధాన్య రంగాల పరంగా చూస్తే- 27 ప్రాజెక్టులు 'కొత్త ఔషధ' విభాగం కిందకు, 5 'సంక్లిష్ట జెనరిక్స్-బయోసిమిలార్స్' కిందకు, 9 'నవ్య వైద్య పరికరాల' కిందకు వస్తాయి.

ప్రధానంగా పరిమాణం ప్రాతిపదికగా గల ఫార్మాస్యూటికల్ నమూనా నుంచి ఆవిష్కరణాధారిత, సాంకేతిక పరిజ్ఞాన-కేంద్రక నమూనా వైపు పరిణామాత్మకతను ఇవన్నీ ప్రస్ఫుటం చేస్తున్నాయి. ఈ రూపాంతరీకరణలో ఇప్పటికే స్థిరపడిన ఔషధ కంపెనీలు, బయోటెక్నాలజీ సంస్థలు, మెడ్‌టెక్ ఆవిష్కర్తలు ఒకే వేదికపైకి వస్తారు.

ఈ జాబితాలకు సంబంధించి- "బయోకాన్, భారత్ బయోటెక్, సన్ ఫార్మా, వోక్‌హార్డ్, జైడస్, మ్యాన్‌కైండ్ ఫార్మా, పాండోరమ్ టెక్నాలజీస్, సెల్లోజెన్ థెరప్యూటిక్స్, ఆరిజీన్ ఆంకాలజీ, బగ్‌వర్క్స్ రీసెర్చ్" వంటి కంపెనీలు ఆవిష్కరణ ప్రాజెక్టులలో ఉన్నాయి. ఇవన్నీ 'పీఆర్ఐపీ' కింద మద్దతు గల విస్తృత శ్రేణి ఆవిష్కరణలకు కృషి చేస్తాయి. వీటిలో 'ఫస్ట్-ఇన్-క్లాస్' ఆవిష్కరణలు, అత్యాధునిక సాంకేతికతలు, ప్రపంచ మార్కెట్ల సంధానావకాశాలుగల ఆవిష్కరణలు, అధిక ప్రజారోగ్య ప్రాధాన్యంగల రంగాలకు పరిష్కారాలు అందించే వ్యూహాత్మక ప్రాధాన్య ఆవిష్కరణలు ఉన్నాయి. ఈ వర్గీకరణ కింద మద్దతు పొందిన ప్రాజెక్టులలో బహుళ ఔషధ నిరోధక గ్రామ్-నెగటివ్ ఇన్ఫెక్షన్లు లక్ష్యమైన యాంటీ బాక్టీరియల్, కార్నియల్ వ్యాధికి ఎక్సోజోమ్ ఆధారిత పునరుత్పత్తి చికిత్స వంటివి ఉన్నాయి. అలాగే, ఇన్-వివో సీఏఆర్-టి వేదిక, రోగి నుంచి తీసిన రొమ్ము క్యాన్సర్ ఆర్గానాయిడ్లు, ప్రోగ్రామబుల్ ఆర్ఎన్ఏ లక్షిత యాంటీ వైరల్ టెక్నాలజీ, పాయింట్-ఆఫ్-కేర్ ఇన్ఫెక్షన్ నిర్ధారణ సంబంధిత పోర్టబుల్ ప్లాస్మోనిక్-పీసీఆర్, క్షయవ్యాధిని గుర్తించే మైక్రోఫ్లూయిడిక్ వేదిక వంటివి కూడా ఉన్నాయి.

వ్యూహాత్మక ప్రాధాన్య చట్రం కింద నిర్లక్ష్యానికి గురైన ఉష్ణమండల వ్యాధులు, అరుదైన వ్యాధులు, భారత ప్రాధాన్య వ్యాధికారకాలకు ఏఎంఆర్ వ్యాప్తి లేదా మహమ్మారిగా మారే అవకాశం గల వ్యాధికారకాలు, వ్యాధినివారక టీకాలు వంటి రంగాలను పరిష్కరించే ఆవిష్కరణలకు మెరుగైన మద్దతు లభిస్తుంది. ఈ చట్రం కింద ఇప్పటిదాకా 6 ప్రాజెక్టులకు ఆమోద ముద్ర పడింది. వీటిలో బాక్టీరియల్ న్యుమోనియా/మెనింజైటిస్, డెంగ్యూ, ఇన్ఫ్లుయెంజా, తదుపరి తరం టీబీ టీకాల సంబంధిత ప్రాజెక్టులున్నాయి. తొలివిడత కింద ఇంకా మిగిలిన దరఖాస్తులపై మూల్యాంకనం కొనసాగుతున్న నేపథ్యంలో మరిన్ని వివరాలు వచ్చే నెలలో వెల్లడవుతాయి.

# లాల్ బహదూర్ శాస్త్రి సేవలు చిరస్మరణీయం



నిజామాబాద్, అక్టోబర్ 2:భారత మాజీ ప్రధాని, భారత రత్న లాల్ బహదూర్ శాస్త్రి జయంతి సందర్భంగా నిజామాబాద్ అర్బన్ మాజీ ఎమ్మెల్యే గణేష్ బిగాల ఘనంగా నివాళులర్పించారు. నిజామాబాద్‌లోని తిలక్ గార్డెన్ చౌరస్తాలో ఉన్న లాల్ బహదూర్ శాస్త్రి విగ్రహానికి పూలమాల వేసి ఆయన దేశానికి చేసిన సేవలను స్మరించుకున్నారు. ఈ సందర్భంగా గణేష్ బిగాల మాట్లాడుతూ.. దేశం కోసం లాల్ బహదూర్ శాస్త్రి అందించిన సేవలు చిరస్మరణీయమని అన్నారు. ఆయన జీవితంలో పాటించిన నిజాయితీ, నిరాడంబరత నేటి తరానికి ఎప్పటికీ ఆదర్శంగా నిలుస్తాయని పేర్కొన్నారు. ప్రజల్లో ఐక్యతా భావాన్ని పెంపొందించడంతో పాటు దేశ సర్వతోముఖాభివృద్ధికి శాస్త్రి చేసిన కృషి మరువలేనిదని కొనియాడారు.

# గాంధీజీ చూపిన సత్యం, అహింసా మార్గాలను ఆచరించాలి



మహబూబ్‌నగర్, అక్టోబర్ 2:ఆదిలాబాద్ జిల్లా ఉట్నూర్ ఐటీడీఏ కార్యాలయ ప్రాంగణంలో శుక్రవారం మహాత్మా గాంధీ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి మంద మకరందు మహాత్మా గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు.

ఈ సందర్భంగా ప్రాజెక్టు అధికారి మాట్లాడుతూ.. మహాత్మా గాంధీ అహింస, సత్యం, శాంతి, స్వచ్ఛత వంటి విలువలను ప్రజలకు చాటి చెప్పారని అన్నారు. గాంధీజీ చూపిన సత్యం, అహింసా మార్గాలను ప్రతి ఒక్కరూ తమ జీవితంలో ఆచరించాలని సూచించారు. సమాజంలో శాంతి, సౌభ్రాతృత్వం, ఐక్యతను పెంపొందించేందుకు ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతను నిర్వర్తించాలని పేర్కొన్నారు.

అనంతరం కార్యాలయ సిబ్బందితో కలిసి గాంధీజీ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. కార్యక్రమంలో ఐటీడీఏ ఏపీవో వసంతరావు జాదవ్, ఐటీడీఏ ఈఈ తానాజీ జాదవ్‌తో పాటు కార్యాలయ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# జాతిపిత మహాత్మా గాంధీకి ఘన నివాళులు

### సత్యం, అహింస మార్గాలను స్మరించుకున్న గ్రేటర్ వరంగల్ అధికారులు

వరంగల్, అక్టోబర్ 2: జాతిపిత మహాత్మా గాంధీ జయంతిని పురస్కరించుకుని శుక్రవారం గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ ప్రధాన కార్యాలయంలో గాంధీజీ జయంతి వేడుకలను నిర్వహించారు. కార్యాలయ ఆవరణలోని మహాత్మా గాంధీ విగ్రహానికి అదనపు కమిషనర్ ఇసంపల్లి జోనా, సూపరింటెండింగ్ ఇంజనీర్ రాజ్‌కుమార్, వివిధ విభాగాల అధికారులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

ఈ సందర్భంగా మహాత్మా గాంధీ దేశానికి అందించిన సేవలను, ఆయన అనుసరించిన సత్యం, అహింస మార్గాలను అధికారులు స్మరించుకున్నారు. గాంధీజీ ఆశయాలు, సిద్ధాంతాలు నేటి తరానికి స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు.

# గాంధీజీ ఆశయాలు పోలీసులకు మార్గదర్శకం

### అహింస, సత్యం, శాంతి మార్గాలను ప్రతి ఒక్కరూ అలవరచుకోవాలి: అదనపు ఎస్పీ వెంకటేశ్వర్లు

మహబూబ్‌నగర్, అక్టోబర్ 2: నాగర్‌కర్నూల్ జిల్లా పోలీస్ కార్యాలయంలో జాతిపిత మహాత్మా గాంధీ 157వ జయంతి వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు ఎస్పీ ఎన్. వెంకటేశ్వర్లు మహాత్మా గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు.

ఈ సందర్భంగా అదనపు ఎస్పీ మాట్లాడుతూ.. మహాత్మా గాంధీ చూపిన అహింస, సత్యం, శాంతి మార్గాలు నేటి సమాజానికి, పోలీస్ వ్యవస్థకు ఎంతో మార్గదర్శకంగా నిలుస్తున్నాయని అన్నారు. గాంధీజీ ఆశయాలను ప్రతి ఒక్కరూ తమ జీవితంలో అలవరచుకోవాలని సూచించారు.

సమాజంలో శాంతిభద్రతల పరిరక్షణతో పాటు ప్రజాసేవకు పోలీసులు నిబద్ధతతో పనిచేయడమే గాంధీజీకి అందించే నిజమైన నివాళి అని పేర్కొన్నారు. కార్యక్రమంలో రిజర్వ్ ఇన్‌స్పెక్టర్ జగన్, ఎస్ఐలు రమేష్, శ్రీనివాస్, ఆర్ఎస్ఐలు ప్రశాంత్, గౌస్‌పాషా, శివాజీతో పాటు జిల్లా పోలీస్ కార్యాలయ సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# మూసాను మట్టుబెట్టేందుకు జరిపిన ప్రస్తుత ఎదురుకాల్పులు మేలోనే 'ఆపరేషన్ షెరువాలీ' పేరుతో ప్రారంభం

న్యూ ఢిల్లీ, అక్టోబర్ 2:నిఘా వర్గాల ద్వారా అందిన సమాచారం ఆధారంగా సంయుక్తంగా చేపట్టిన ఆపరేషన్‌లో, లష్కరే తోయిబా సీనియర్ కమాండర్ మూసా అలియాస్ ఆసిఫ్ ఫౌజీని జమ్మూ-కశ్మీర్‌లోని బద్గావ్ జిల్లాలో ఖాన్‌సాహిబ్ పోలీస్ స్టేషన్ పరిధిలోని గుర్వత్కలాన్ వద్ద భద్రతా దళాలు మట్టుబెట్టాయి. మూసా కోసం భద్రతా దళాలు చాలాకాలంగా గాలింపు కొనసాగిస్తున్నాయి. ఇటీవల అతని కదలికలు, ఉనికికి సంబంధించి సాంకేతిక, మానవ నిఘా వర్గాల ద్వారా సమాచారం అందడంతో, అతడిని మట్టుబెట్టేందుకు సంబంధిత అన్ని భద్రతా విభాగాల సమన్వయంతో ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికను రూపొందించారు.

భద్రతా దళాల చేతిలో మూసా హతం కావడంతో జమ్మూ-కశ్మీర్ కేంద్ర పాలిత ప్రాంతంలో ఉగ్రవాద నెట్‌వర్క్‌కు గట్టి ఎదురుదెబ్బ తగిలినట్టయింది. మూసా హతంతో, 2022 నుంచి జమ్మూ-కశ్మీర్‌లో కార్యకలాపాలు నిర్వహిస్తూ, పలు సంచలనాత్మక దాడులకు బాధ్యులైన లష్కరే తోయిబాకు చెందిన నలుగురు సీనియర్ కమాండర్ల మొత్తం బృందం పూర్తిగా అంతమైంది. ఈ కమాండర్లు వీరు హోలన్ దాడి (ఆగస్టు 2023), డికెజి దాడి (డిసెంబర్ 2023), కండి దాడి (మే 2023), షాసితార్ దాడి (మే 2024), శివ ఖోరీ దాడి (జూన్ 2024), గగన్‌గిర్ దాడి (అక్టోబర్ 2024), బూటాపాత్రీ దాడి (అక్టోబర్ 2024), బైసారన్ దాడి (ఏప్రిల్ 2025) వంటి సంచలనాత్మక దాడులకు బాధ్యులు. ఈ బృందంలోని మిగిలిన ముగ్గురు సభ్యులను భద్రతా దళాలు వేర్వేరు ఎన్‌కౌంటర్లలో మట్టుబెట్టాయి. జునైద్ భట్‌ను 2024 డిసెంబరు 3న దాచిగామ్‌లో, సులేమాన్‌ను 2025 జూలై 28న 'ఆపరేషన్ మహాదేవ్'లో, యాసిర్‌ను 2026 సెప్టెంబరు 4న 'ఆపరేషన్ అఖ్దర్'లో మట్టుబెట్టారు. మూసాను మట్టుబెట్టేందుకు ప్రస్తుతం నిర్వహించిన ఎన్‌కౌంటర్ కూడా దీర్ఘకాలంగా కొనసాగుతున్న ఆపరేషన్‌లో భాగమే.

గత కొన్ని సంవత్సరాలుగా జమ్మూ-కశ్మీర్ పోలీసులు, భారత సైన్యం, కేంద్ర సాయుధ పోలీసు దళాలు వంటి అన్ని భద్రతా సంస్థలు పరస్పర సమన్వయంతో ఉగ్రవాద వ్యతిరేక కార్యకలాపాలను నిర్వహిస్తున్నాయి. ఈ సమన్వయంతో చేపట్టిన చర్యలు సానుకూల ఫలితాలను అందిస్తున్నాయి.

## సంస్కృతి టౌన్‌షిప్‌లో పేకాట స్థావరంపై పోలీసుల దాడి

హైదరాబాద్, అక్టోబర్ 2: సంస్కృతి టౌన్‌షిప్‌లోని ఓ ఫ్లాట్‌లో డబ్బులతో పందాలు కాస్తూ పేకాట ఆడుతున్న ఆరుగురిని పోచారం ఐటీసీ పోలీసులు గురువారం రాత్రి అదుపులోకి తీసుకున్నారు. పోలీసుల కథనం ప్రకారం.. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా పోచారం ఐటీసీ పోలీస్ స్టేషన్ పరిధిలోని అన్నోజిగూడ సంస్కృతి టౌన్‌షిప్, ఏ-24 బ్లాక్, ఫ్లాట్ నంబర్ 106లో నగదుతో పేకాట ఆడుతున్నారనే విశ్వసనీయ సమాచారం పోలీసులకు అందింది.

దీంతో ఎస్ఐ నాగేశ్వరరావు నేతృత్వంలో పోలీసులు దాడి నిర్వహించారు. ఈ సందర్భంగా బత్తిని కొమురయ్య, గుండు వెంకటేశ్వర్లు, అముద శ్రీనివాస్, జులుకుంట్ల సుకృత్‌రెడ్డి, కుకునూరి రామచంద్రారెడ్డి, గుడిపాటి కరుణాకర్‌రెడ్డిని అదుపులోకి తీసుకున్నారు.

# గాంధీజీ ఆశయాలు అందరికీ ఆదర్శప్రాయం

**-జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్**

సంగారెడ్డి, అక్టోబర్ 2:(నేటినిజం ప్రతినిధి): మహాత్మా గాంధీజీ ఆశయాలు సమాజానికి నేటికీ మార్గదర్శకమని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ అన్నారు. గాంధీజీ జయంతిని పురస్కరించుకుని శుక్రవారం సంగారెడ్డి కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన కార్యక్రమంలో కలెక్టర్ గాంధీజీ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. దేశ స్వాతంత్ర్య సాధన కోసం మహాత్మా గాంధీజీ అహింస, సత్యాగ్రహ మార్గాలను అనుసరించి ప్రజలను ఏకతాటిపైకి తీసుకువచ్చారని తెలిపారు.

సత్యం, అహింస, శాంతి, స్వచ్ఛత, గ్రామ స్వరాజ్యం వంటి గాంధీజీ ఆశయాలు అందరికీ ఆదర్శప్రాయమని పేర్కొన్నారు. గాంధీజీ చూపిన మార్గంలో ప్రతి ఒక్కరూ నడుస్తూ సమాజ అభివృద్ధికి తమ వంతు కృషి చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం అధికారులు, కలెక్టరేట్ ఏవో విజయలక్ష్మి, సిబ్బంది గాంధీజీ చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో కలెక్టరేట్ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.




# మాదకద్రవ్యాలపై పోరాటంలో పెద్ద విజయం

న్యూ ఢిల్లీ, అక్టోబర్ 2:మత్తు పదార్థాలకు వ్యతిరేకంగా సాగిస్తున్న పోరులో ప్రధాన విజయమిది.. భారత ప్రత్యేక ఆర్థిక మండలం (ఈఈజడ్) పరిధిలో ఓ ఇరాన్ పడవలో నుంచి 526 కిలోల మెథంఫెటమైన్, హెరాయిన్ అనే మాదకద్రవ్యాలను జప్తు చేసుకోవడంతో పాటు అయిదుగురు పాకిస్తానీ పౌరులను అరెస్టు చేశారని కేంద్ర హోం, సహకార శాఖ మంత్రి శ్రీ అమిత్ షా ఈ రోజు తెలిపారు. ఈ ఆపరేషన్లో గుజరాత్ తీవ్రవాద నిరోధక దళం (ఏటీఎస్), భారతీయ కోస్తాతీర రక్షకదళంతో పాటు కేంద్రానికి చెందిన రహస్య సమాచార ఏజెన్సీలు కలిసి కట్టుగా పాల్గొన్నాయని మంత్రి వెల్లడించారు. సామాజిక మాధ్యమ వేదిక 'ఎక్స్'లో ఒక సందేశాన్నికేంద్ర హోం మంత్రి శ్రీ అమిత్ షా పొందుపరుస్తూ, "మత్తు మందుల భూతం బారి నుంచి దేశ యువతను రక్షించాలని మోదీ ప్రభుత్వం దృఢనిశ్చయంతో ఉంది. గుజరాత్ ఏటీఎస్, భారతీయ కోస్తా తీరరక్షక దళం, కేంద్రీయ రహస్య సమాచార ఏజెన్సీలు కలిసికట్టుగా ఓ ఆపరేషన్‌ను నిర్వహించి భారత ఈఈజడ్ పరిధిలోకి వచ్చిన ఓ ఇరాన్ పడవలో నుంచి 526 కిలోల మెథంఫెటమైన్‌ను, హెరాయిన్‌ను స్వాధీనం చేసుకున్నాయి. ఈ మత్తుపదార్థాలను జప్తు చేసుకున్న ప్రాంతం ముంబయికి నైరుతి దిక్కున 460 నాటికల్ మైళ్లు, లక్షద్వీప్‌కు వాయవ్య దిక్కున 160 నాటికల్ మైళ్ల దూరంలో నెలకొంది. ఈ సందర్భంగా అయిదుగురు పాకిస్తానీలను అరెస్టు చేశారు. విస్తృత నెట్‌వర్క్ గుట్టును ఛేదించాలని, లక్షిత లబ్ధిదారులను కనుగొనాలనే లక్ష్యాలతో దర్యాప్తును తీవ్రతరం చేశారు. 16 రోజుల పాటు సాగిన ఆపరేషన్లో ఇరాన్‌కు చెందిన ఓ పడవను కూడా స్వాధీనం చేసుకున్నారు. పలు ఏజెన్సీల మధ్య పరస్పర సమన్వయానికి, సహకారానికి ఇది ఒక చక్కని ఉదాహరణగా నిలుస్తోంది" అని పేర్కొన్నారు.ఈ నెల 14 నుంచి 30 వరకు నిర్వహించిన ఈ ఆపరేషన్.. భారత సముద్ర సరిహద్దులను సురక్షితంగా ఉంచడంలో వివిధ ఏజెన్సీలు రహస్య సమాచారం ఆధారంగా చేసుకుని పరస్పర సమన్వయంతో విధులను శక్తిమంతంగా నిర్వహించాయని చాటుతోంది.

నేర నియంత్రణను బలోపేతం చేసేందుకు, మాదకద్రవ్యాల నెట్‌వర్కులను ధ్వంసం చేసేందుకు, మత్తుపదార్థాల నుంచి మన యువతను, మన సమాజాన్ని కాపాడేందుకు మోదీ ప్రభుత్వం తీసుకువచ్చిన 'మాదకద్రవ్యాల నియంత్రణ సంబంధిత దార్శనిక పత్రం (2026-2029)' విస్తృత కార్యాచరణను అందిస్తోంది.సురక్షిత, ఆరోగ్యప్రద, మత్తుమందులకు తావు ఇవ్వని భారత్ ('నషా ముక్త్ భారత్')ను తీర్చిదిద్దడమే మన అందరి ఉమ్మడి జాతీయ సంకల్పం.

# గాంధీజీ మార్గం నేటి తరానికీ ఆదర్శం : సంగారెడ్డి ఎస్పీ పరితోష్ పంకజ్



సంగారెడ్డి, అక్టోబర్ 2:(నేటినిజం ప్రతినిధి):జాతిపిత మహాత్మా గాంధీ చూపిన సత్యం, అహింస, శాంతి, సామరస్య మార్గాలు నేటి తరానికి కూడా ఆదర్శప్రాయమని సంగారెడ్డి జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ అన్నారు. గాంధీ జయంతిని పురస్కరించుకుని శుక్రవారం సంగారెడ్డి జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన గాంధీజీ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు.

ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. భారత స్వాతంత్ర్య ఉద్యమంలో మహాత్మా గాంధీ కీలక పాత్ర పోషించారని పేర్కొన్నారు. అహింసా సిద్ధాంతాన్ని ఆయుధంగా చేసుకుని దేశ ప్రజలను ఏకతాటిపైకి తీసుకువచ్చిన మహనీయుడని కొనియాడారు. గాంధీజీ బోధించిన సత్యం, అహింస, శాంతి, సామరస్య సూత్రాలను ప్రతి ఒక్కరూ తమ జీవితంలో ఆచరించాలని సూచించారు.గాంధీజీ ఆశయాలను అనుసరించడం ద్వారా సమాజంలో శాంతి, సోదరభావం, ఐకమత్యం మరింత బలోపేతమవుతాయని ఎస్పీ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ చైతన్య రెడ్డి, సంగారెడ్డి డీఎస్పీ సత్యయ్యగౌడ్, ఏఆర్ డీఎస్పీ నరేందర్, డీసీఆర్బీ ఇన్‌స్పెక్టర్ రమేష్, ఎస్బీ ఇన్‌స్పెక్టర్ సదా నాగరాజు, ఆర్ఐలు సురేష్ నాయక్, డానియెల్, రాజశేఖర్ రెడ్డితో పాటు వివిధ విభాగాలకు చెందిన డీపీఓ సిబ్బంది పాల్గొన్నారు.

## గాంధీ ఆశయాలే మార్గదర్శకం

హైదరాబాద్, అక్టోబర్ 2: జాతిపిత మహాత్మా గాంధీ జయంతి వేడుకలను వికారాబాద్ జిల్లా పోలీస్ కార్యాలయంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా, ఐపీఎస్ మహాత్మా గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు.

ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. సత్యం, అహింస, శాంతి, సహనం, క్రమశిక్షణ, సేవాభావం వంటి మహాత్మా గాంధీ ఆశయాలు నేటి సమాజానికి కూడా ఎంతో ఆదర్శప్రాయమని అన్నారు. గాంధీజీ తన జీవితాన్ని సత్యం, అహింస సిద్ధాంతాలకు అంకితం చేసి, ప్రజల్లో స్వాతంత్ర్య స్ఫూర్తిని నింపారని పేర్కొన్నారు.

గాంధీజీ ఆలోచనలు, విలువలు సమాజంలో శాంతి, సామరస్యం, సోదరభావాన్ని పెంపొందించేందుకు ఎప్పటికీ మార్గదర్శకంగా నిలుస్తాయని ఎస్పీ తెలిపారు. ప్రజలు పరస్పరం గౌరవించుకోవడం, సమస్యలను శాంతియుతంగా పరిష్కరించుకోవడం, చట్టాలను గౌరవించడం ఎంతో ముఖ్యమన్నారు.

పోలీసు శాఖ ప్రజల రక్షణ, శాంతిభద్రతల పరిరక్షణ కోసం నిరంతరం పనిచేస్తుందని ఎస్పీ తెలిపారు. విధి నిర్వహణలో నిజాయితీ, నిబద్ధత, క్రమశిక్షణ, మానవతా దృక్పథాన్ని పాటిస్తూ ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని పోలీసు అధికారులు, సిబ్బందికి సూచించారు.

ప్రజలతో స్నేహపూర్వకంగా వ్యవహరిస్తూ వారి సమస్యలను పరిష్కరించడంలో ముందుండాలని ఎస్పీ సూచించారు. మహాత్మా గాంధీ కలలుగన్న శాంతియుత, సమానత్వం, సోదరభావం కలిగిన సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో వికారాబాద్ డీఎస్పీ అంజయ్య, ఏఆర్ డీఎస్పీ వీరేశ్, ఆర్ఐలు శ్రీశైలం, అశోక్, ఎస్ఐలు, ఆర్ఎస్ఐలు, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొని మహాత్మా గాంధీకి ఘన నివాళులర్పించారు.

# రూ.3,000 కోట్ల విలువైన మాదకద్రవ్యాలు స్వాధీనం... అంతర్జాతీయ డ్రగ్స్ ముఠాను పట్టుకున్న ఐసీజీ

న్యూ ఢిల్లీ, అక్టోబర్ 2: భారత తీర రక్షక దళం ( ఐసీజీ), గుజరాత్ ఉగ్రవాద నిరోధక దళంతో (ఏటీఎస్) కలిసి 2026 సెప్టెంబర్ 25న లక్షద్వీప్‌కు పశ్చిమాన అరేబియా సముద్రంలో భారీ ఆపరేషన్ నిర్వహించింది. ఈ దాడుల్లో అంతర్జాతీయ ముఠా రూ.3,000 కోట్లకు పైగా విలువైన భారీ మాదకద్రవ్యాల అక్రమ రవాణాకు చేస్తున్న ప్రయత్నాన్ని భగ్నం చేసింది.

ఈ సంయుక్త ఆపరేషన్‌లో హెరాయిన్, మెథాంఫెటమైన్ సహా సుమారు 526 కిలోల మాదకద్రవ్యాలను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఈ డ్రగ్స్‌ను తరలిస్తున్న నౌకలో ఉన్న అయిదుగురు పాకిస్థాన్ జాతీయులను అదుపులోకి తీసుకున్నారు.

పక్కా సమాచారం ఆధారంగా... ఐసీజీ బలగాలు సముద్రం, గగనతలం నుంచి అనుమానిత నౌకపై నిఘా పెట్టారు. నౌక కదలికలను నిరంతరం గమనిస్తూ, సమన్వయంతో ఒకేసారి దాడికి దిగారు. ఈ ఆపరేషన్ ఫలితంగా అంతర్జాతీయ జలాల్లో అనుమానాస్పదంగా సంచరిస్తున్న ఇరాన్‌కు చెందిన సంప్రదాయ నౌకను అడ్డుకుని తనిఖీ చేశారు.

అడ్డుకున్న నౌకను, అందులోని సిబ్బందిని, స్వాధీనం చేసుకున్న మాదకద్రవ్యాలను తదుపరి దర్యాప్తు కోసం సాయుధ భద్రత నడుమ ముంబైకి తరలించారు. అక్కడ సంయుక్త విచారణ చేపట్టడం తో పాటు వివిధ దర్యాప్తు సంస్థల సమన్వయంతో చట్టపరమైన ప్రక్రియను చేపట్టారు.

ఈ విజయవంతమైన ఆపరేషన్ 'నషా ముక్త్ భారత్' లక్ష్యానికి గణనీయమైన సహకారంగా నిలిచిందని ఐసీజీ పేర్కొంది. భారత సముద్ర జలాల్లో మాదకద్రవ్యాల అక్రమ రవాణాను అడ్డుకోవడం, అక్రమ కార్యకలాపాలను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించేది లేదని, తమ నిబద్ధతను ఈ చర్య మరోసారి చాటిందని తెలిపింది.

# ఎమ్‌హెచ్ఐ ఇండస్ట్రీ యాక్సిలరేటర్ ఇంపాక్ట్ రిపోర్టును విడుదల చేసి, ప్రాజెక్టు సభ్యులను సత్కరించిన శ్రీ హెచ్.డి. కుమారస్వామి

న్యూ ఢిల్లీ, అక్టోబర్ 2:న్యూ ఢిల్లీలో నవీజ్ఞ?న్-2026ను నిర్వహించిన సందర్భంగా భారీ పరిశ్రమల మంత్రిత్వ శాఖ (ఎమ్‌హెచ్ఐ) ఇండస్ట్రీ యాక్సిలరేటర్ ప్రాజెక్టుకు చెందిన ఇంపాక్ట్ రిపోర్టును కేంద్ర భారీ పరిశ్రమలు, ఉక్కు శాఖ మంత్రి శ్రీ హెచ్.డి. కుమారస్వామి డిజిటల్ మాధ్యమం ద్వారా విడుదల చేశారు. దీంతో భారతదేశ మొబిలిటీ, తయారీ రంగాలను దృష్టిలో పెట్టుకొని దేశవాళీ సాంకేతికతలను అభివృద్ధిపరిచి, మరింత ముందుకు తీసుకుపోయే దిశగా ఒక ప్రధాన ముందంజ వేసినట్లయింది.




మంత్రి శ్రీ హెచ్.డి. కుమారస్వామి సభను ఉద్దేశించి ప్రసంగిస్తూ, భారీ పరిశ్రమల మంత్రిత్వ శాఖ చేపట్టిన ఇండస్ట్రీ యాక్సిలరేటర్ ప్రాజెక్టు సమాప్తం అయిందని ఈ కార్యక్రమం సూచిస్తోందన్నారు. స్వదేశీ సాంకేతిక, తయారీ రంగ సామర్థ్యాలను మరింత పెంపొందింపచేసుకోవడానికి ప్రాధాన్యాన్ని ఇవ్వాలని ఆయన స్పష్టం చేశారు.

"గౌరవ ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ దార్శనిక నాయకత్వంలో కేంద్ర ప్రభుత్వం దేశీయ సాంకేతిక, తయారీ సామర్థ్యాలను పెంపొందించడానికి చాలా ప్రాధాన్యాన్ని ఇస్తోంది" అని మంత్రి అన్నారు.

ఆత్మనిర్భర్ భారత్ గమ్యస్థానాన్ని చేరుకోవాలంటే భారత్ ఆధునిక సాంకేతికతలకు ఒక పెద్ద మార్కెట్టుగా రూపొందడానికి మించి ఆయా సాంకేతికతలను విరివిగా తయారు చేసి, ఎగుమతి చేసే సత్తాను పుంజుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని మంత్రి అన్నారు.

"ఆత్మనిర్భర్ భారత్ ఆశయాన్ని సాధించడానికి భారత్ అధునాతన సాంకేతికతలకు ఒక పెద్ద మార్కెట్టుగా రూపొందితేనే సరిపోదు, ఆయా సాంకేతికతలను అభివృద్ధిచేయడం, తయారీకి నడుం బిగించడంతో పాటు వాటిని ఎగుమతి చేసే శక్తిని కూడా సంతరించుకోవాలి" అని శ్రీ హెచ్.డి. కుమారస్వామి ఉద్బోధించారు.

భారతీయ భారీ యంత్ర పరికరాల రంగం రెండో దశలో భాగంగా పోటీపడే తత్వాన్ని పెంపొందించే పథకం కింద విస్తృత స్థాయిలో మద్దతును అందించిన సంగతిని మంత్రి ప్రస్తావించారు. ఈ పథకానికి మొత్తం రూ.1,207 కోట్ల ఆర్థిక వ్యయాన్ని నిర్దేశించారని, ఉమ్మడి సాంకేతిక అభివృద్ధితో పాటు సేవల రంగంలో మౌలిక సదుపాయాల కల్పనకు మద్దతివ్వడం దీని లక్ష్యమని ఆయన తెలిపారు. ఈ పథకంలో భాగంగా, 33 ప్రాజెక్టులను ఆమోదించారన్నారు.

ఈ కార్యక్రమాల్లో ఒకటైన ఎమ్‌హెచ్ఐ ఇండస్ట్రీ యాక్సిలరేటర్ ప్రోగ్రామ్ మొత్తం 10 సాంకేతికతలకు రూ.35.72 కోట్ల ఆర్థిక సహాయాన్ని సమకూర్చిందని, ఆయా సాంకేతికతలు టెక్నాలజీ రెడినెస్ లెవెల్ (టీఆంఎల్) 3 నుంచి లెవెల్ 9కి పురోగమించాలనే ఉద్దేశంతో ఈ మేరకు సహాయాన్ని అందించారని మంత్రి వివరించారు.

విద్యుత్తు ఆధారితంగా నడిచే పవర్‌ట్రయిన్లు సహా భవిష్య కాల మొబిలిటీ, అధిక వోల్టేజీ మోటార్ కంట్రోల్, ఇంధన నిల్వ వంటి వివిధ రంగాలతో ముడిపడిన సాంకేతికతలకు ఈ ప్రోగ్రాములో భాగంగా మద్దతును ఇచ్చారని శ్రీ కుమారస్వామి వెల్లడించారు. ఆయా సాంకేతికతలుప్రాథమిక స్థాయి ప్రోటోటైపు (మూలరూపం) దశ నుంచి వాణిజ్యపరంగా లాభదాయకమైన ఉత్పాదనల స్థాయికి చేరుకొన్నాయని ఆయన అన్నారు.

సాంకేతికతను అభివృద్ధి చేయడంలో సహకారానికి ఉన్న ప్రాధాన్యాన్ని మంత్రి ప్రస్తావించారు. నూతన ఆవిష్కరణల విస్తారిత అనుబంధ వ్యవస్థ (ఇకోసిస్టమ్)ను పటిష్టపరచడంలో ప్రభుత్వం, పరిశ్రమ, పరిశోధక సంస్థలు, విద్యారంగ ప్రముఖులు, అంకుర సంస్థలు, ఏఆర్ఏఐ వంటి సంస్థలు ముఖ్య పాత్రను పోషిస్తున్నాయని ఆయన అన్నారు.

"ప్రభుత్వం విధానపరమైన ప్రాథమిక ప్రణాళికను, లక్షిత సమర్థనను అందించగలదు. పరిశ్రమ మార్కెట్టు పట్ల అవగాహనను, తయారీ సామర్థ్యాన్ని జోడించగలదు. పరిశోధక సంస్థలు, విద్యాసంస్థలు జ్ఞ?నం, సాంకేతికత అంశాల్లో తోడ్పాటును అందించగలవు. అంకుర సంస్థలు కొత్త కొత్త ఆలోచనలను, క్రియాశీలత ని సమకూర్చగలవు" అని ఆయన వివరించారు.

సాంకేతికత అభివృద్ధి, తనిఖీ, పరిశ్రమలో ఆయా సాంకేతికతల స్వీకారం.. వీటి మధ్య ఉన్న అంతరాన్ని తొలగించడంలో ఏఆర్ఏఐ వంటి సంస్థలు పోషించవలసిన భూమికను గురించి కూడా ఆయన ఈ సందర్భంగా ప్రస్తావించారు.

భారతదేశం 2047కల్లా అభివృద్ధి చెందిన దేశంగా మారాలన్న గమ్యం వైపు పయనిస్తున్న క్రమంలో, దేశం లోపల శక్తియుక్తులను పెంపొందింపచేసుకోవడంతో పాటు భారతీయ సాంకేతికతలను అంతర్జాతీయ మార్కెట్లలోకి తీసుకుపోవడంపైన కూడా దృష్టిని కేంద్రీకరించాల్సివుందని శ్రీ కుమారస్వామి సూచించారు.

"ఈ విధమైన ఇకోసిస్టమ్‌ను మనం మరింత బలోపేతం చేసుకోవాలి. 'వికసిత్ భారత్‌ఏ2047' వైపు మనం పయనిస్తున్నాం. ఈ క్రమంలో మన లక్ష్యం స్పష్టంగా ఉండాలి. నేర్పించడం, కొత్త ఆవిష్కరణలకు నడుం కట్టడం, తయారీ, సాంకేతికతల ఏకీకరణ.. ఈ ప్రక్రియలు భారతదేశంలో పూర్తి కావాలి. భారతీయ సాంకేతి కతలను ప్రపంచ మార్కెట్లకు తీసుకుపోవాలి" అని మంత్రి అన్నారు.

స్వావలంబన అంటే, అది దిగుమతులకు ప్రత్యామ్నాయాలను రూపొందించడానికి మాత్రమే పరిమితం కాకూడదని, భారతీయ మేధా సంపత్తిని, ప్రతికూల పరిస్థితులకు, సవాళ్లకు ఎదురీది గమ్యాన్ని చేరుకోగలిగే ప్రబల సరఫరా వ్యవస్థను, నైపుణ్యం కలిగిన మానవ వనరులను సమకూర్చుకోవడంపై శ్రద్ధ వహించాలని మంత్రి స్పష్టం చేశారు.

"స్వావలంబన ధ్యేయం కేవలం దిగుమతులను భర్తీ చేయడం కారాదు. అది.. మేధా సంపత్తి, సరఫరా వ్యవస్థ, నైపుణ్యం కలిగిన సిబ్బందిని అందించగలగాలి" అని శ్రీ కుమారస్వామి అన్నారు.

సాంకేతికత అభివృద్ధితో ముడిపడిన అవసరాలను గుర్తించడం, పరిశ్రమకు, విద్యారంగానికి మధ్య సహకారాన్ని పటిష్టపరచడం, రాబోయే కాలంలో ఎదురుకాగల సాంకేతిక అవసరాలను తీర్చే సత్తా కలిగిన ప్రతిభావంతులను తీర్చిదిద్దడానికి నిరంతర కృషి జరగాలని ఆయన పిలుపునిచ్చారు.

అభివృద్ధితో ముడిపడిన ప్రతి ఒక్క దశలోనూ సమర్థంగా ముందుకు సాగిపోవడానికి వీలు కల్పించే నూతన ఆవిష్కరణలకు చోటిచ్చే ఇకోసిస్టమ్‌ను భారత్ తీర్చిదిద్దుకోవాల్సిందే అని శ్రీ కుమారస్వామి తన ప్రసంగం చివర్లో స్పష్టం చేశారు.

"ప్రోటోటైప్‌ను కనుగొనడం, ప్రోటోటైప్‌ను ఉత్పాదనగా మలచడం, ఉత్పాదనలను ప్రపంచ మార్కెట్టుకు చేర్చడం.. ఈ దశలను భారతీయ నూతన ఆవిష్కరణల వ్యవస్థ సాఫీగా అధిగమించే ఓ ఇకోసిస్టమ్‌ను నిర్మించడానికి మనమందరం మన కృషిని కొనసాగిద్దాం" అని ఆయన అన్నారు.

సాంకేతికతలను అభివృద్ధిపరచడం నుంచి వాటిని పరిశ్రమల్లో వినియోగించేందుకు అనువైనవని ప్రమాణీకరించడం, వాణిజ్య సరళి ఉత్పాదన స్థాయికి చేర్చడంలో తోడ్పాటును అందించిన ఎమ్‌హెచ్ఐ ఇండస్ట్రీ యాక్సిలరేటర్ ప్రాజెక్టులో పనిచేసిన వారిని మంత్రి సత్కరించారు. ఏఆర్ఏఐ-ఏఎమ్‌టీఐఎఫ్ ఆధ్వర్యంలోని ఎమ్‌హెచ్ఐ ఇండస్ట్రీ యాక్సిలరేటర్ ప్రాజెక్టు సమాప్తం అయిందనడానికి సూచికగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రభుత్వం, పరిశ్రమ, విద్యా, పరిశోధన రంగాలు, సాంకేతిక విస్తారిత అనుబంధ వ్యవస్థల ప్రతినిధులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన అంకుర సంస్థల ప్రదర్శనను శ్రీ కుమారస్వామి సందర్శించారు. యాక్సిలరేటర్ ప్రోగ్రాములో భాగంగా మద్దతును అందించిన నూతన ఆవిష్కారాలను ఆయన సమీక్షించారు. విద్యుత్తు వాహనాలు, పవర్ ఎలక్ట్రానిక్స్, హై-వోల్టేజీ వ్యవస్థలు, ఇంధన నిల్వ వ్యవస్థలు, ముందుగా ఊహించగలిగే నిర్వహణ వ్యవస్థలు, సెన్సర్లతో పాటు ఉన్నత స్థాయికి చెందిన సర్ఫేస్ ఇంజినీరింగ్ వంటి రంగాల సాంకేతికతలను ఎగ్జిబిషన్లో ప్రదర్శించారు.

# అధికారిక పత్రాలను కృత్రిమ మేధస్సు ఉపయోగించి బహుభాషల్లోకి అనువదించటానికి శ్రీకారం చుడుతూ 'కాగ్-భాషిణి అనువాద్'ను సంయుక్తంగా ప్రారంభించిన డిజిటల్ ఇండియా భాషిణి డివిజన్, కాగ్

న్యూ ఢిల్లీ, అక్టోబర్ 2:కేంద్ర ప్రభుత్వ ఎలక్ట్రానిక్స్, సమాచార సాంకేతిక మంత్రిత్వ శాఖ (మైటీ) ఆధ్వర్యంలోని డిజిటల్ ఇండియా కార్పొరేషన్ (డీఐసీ) కింద పనిచేస్తున్న డిజిటల్ ఇండియా భాషిణి డివిజన్ (డీఐబీడీ).. కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ ఆఫ్ ఇండియా (కాగ్) కార్యాలయంతో కలిసి ఈ రోజు 'కాగ్-భాషిణి అనువాద్'ను ప్రారంభించింది. అధికారిక కాగ్ పత్రాలు, ఆడిట్-సంబంధిత నివేదికల అనువాదానికి మద్దతుగా భాషిణి అభివృద్ధి చేసిన ఏఐ ఆధారిత అనువాద పరిష్కారం ఇది. దిల్లీలోని కాగ్ కార్యాలయంలో జరిగిన 74వ హిందీ దినోత్సవం, హిందీ పక్షోత్సవాలు 2026 ముగింపు వేడుక సందర్భంగా ఈ పరిష్కారాన్ని విడుదల చేశారు.

ఈ కార్యక్రమానికి కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ శ్రీ కె. సంజయ్ మూర్తి, డిప్యూటీ కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ శ్రీ ఎ. ఎం. బజాజ్, అడిషనల్ డిప్యూటీ కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ డాక్టర్ నిలోత్పల్ గోస్వామి, డైరెక్టర్ జనరల్ శ్రీ అథర్వ సిన్హా, తదితర సీనియర్ కాగ్ అధికారులు, ఇతర అధికారులు, ప్రముఖులు హాజరయ్యారు.

భాషిణికి ఉన్న బహుభాషా సాంకేతిక సామర్థ్యాలను కాగ్‌కు ఉన్న ప్రత్యేక భాషా అవసరాలతో మిళితం చేస్తూ సంస్థాగత ప్రక్రియలో లాంగ్వేజ్ఏఐని తీసుకురావడంలో ఈ ప్రారంభోత్సవం ఒక ముఖ్యమైన ఘట్టంగా నిలుస్తుంది. తగిన మానవ పర్యవేక్షణను కొనసాగిస్తూ ఇప్పటికే ఉన్న సంస్థాగత ప్రక్రియలకు అనుబంధంగా ఉంటూ అధికారిక- ఆడిట్ సంబంధిత పత్రాల అనువాదానికి మద్దతుగా ఇది రూపుదిద్దుకుంది.

స్థిరమైన పదజాలాన్ని, సందర్భోచిత అనువాదాన్ని, అవుట్‌పుట్ నాణ్యతను సమర్థవంతంగా అందించడంపై దృష్టి సారిస్తూ కాగ్ కోసం ప్రత్యేకించిన లాంగ్వేజ్ఏఐ పరిష్కారంగా 'కాగ్-భాషిణి అనువాద్'ను అభివృద్ధి చేశారు. భద్రత, నియంత్రిత యాక్సెస్, డేటా సార్వభౌమత్వం వంటి సంస్థాగత అవసరాలను పరిష్కరిస్తూనే అధికారిక పత్రాల అనువాదం కోసం ఈ పరిష్కారం ఏఐ ఆధారిత వాతావరణాన్ని అందిస్తుంది.

భాషలవారీగా అధికారిక సమాచారాన్ని మరింత సులభంగా అందుబాటులోకి తీసుకురావడానికి ప్రభుత్వ సంస్థలకు లాంగ్వేజ్ఏఐ అందిస్తోన్న విస్తృత అవకాశాన్ని ఈ సహకారం తెలియజేస్తోంది. సుస్థిరమైన సంస్థాగత ప్రక్రియల్లో బహుభాషా ఏఐ సామర్థ్యాలను అనుసంధానించడం ద్వారా భారతీయ భాషల్లో అధికారిక సమాచారాన్ని మరింత విస్తృతంగా, సమర్థవంతంగా పొందేలా ఇది దోహదపడుతుంది.

ప్రభుత్వం, ప్రజా సేవల్లో దీని అనువర్తనాలను ప్రధానంగా తెలియజేస్తూ డిజిటల్ ఇండియా భాషిణి లాంగ్వేజ్ఏఐ సామర్థ్యాలపై ఈ కార్యక్రమంలో ఒక ప్రత్యేక ప్రదర్శన నిర్వహించారు. కాగ్ కార్యాలయంలో 'కాగ్-భాషిణి అనువాద్' పరిష్కారాన్ని అధికారికంగా ప్రారంభించడం కూడా ఈ కార్యక్రమంలో మరో ముఖ్యాంశంగా నిలిచింది.

ఈ కార్యక్రమంలో డిజిటల్ ఇండియా భాషిణి డివిజన్ సీఈఓ శ్రీ అమితాబ్ నాగ్ మాట్లాడుతూ.. భాషా డేటా, ఏఐ నమూనాలు- అప్లికేషన్లు- వినియోగ సందర్భాల్లో భాషిణి అభివృద్ధిని, భారత భాషా వైవిధ్యానికి సరిపోయే సార్వభౌమ లాంగ్వేజ్ఏఐ ప్లాట్‌ఫామ్ రూపకల్పనను వివరించారు.

భాషిణి ప్రస్తుతం 36 భారతీయ టెక్స్ట్ భాషలు, 23 భారతీయ వాయిస్ భాషలు, 35 అంతర్జాతీయ భాషలకు మద్దతు ఇస్తోందని.. ప్రజా సేవా రంగాల్లో పెరుగుతున్న విభిన్న అవసరాలకు ఇది ఉపయోగపడుతోందని ఆయన పేర్కొన్నారు. బహుభాషా వ్యవసాయ సలహాలు, వాయిస్-ఎనేబుల్డ్ ఫిర్యాదుల నమోదు, ప్రాసెసింగ్.. వాయిస్, టెలిఫోన్ ఆధారిత ఇంటర్‌ఫేస్‌ల ద్వారా సేవలను అందించే సంభాషణ సేవలు వీటిలో ముఖ్యమైనవి.

భారత కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ శ్రీ కే. సంజయ్ మూర్తి మాట్లాడుతూ.. ఆడిట్ ఫలితాలు, నివేదికలను ప్రజలు అర్థం చేసుకునే భాషల్లో అందేలా చూసే ప్రాముఖ్యతను ప్రముఖంగా చెప్పారు. అధికారిక కార్యకలాపాల్లో హిందీ, ఇతర భారతీయ భాషల వినియోగాన్ని బలోపేతం చేసే ప్రయత్నాలకు దోహదపడుతూనే స్థానిక, ప్రాంతీయ భాషల్లో ఆడిట్ సమాచారాన్ని సులభంగా పొందేలా చేయడంలో సాంకేతికతకు ఉన్న సామర్థ్యాన్ని ఆయన ప్రస్తావించారు.

భారత కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ కార్యాలయం అదనపు డిప్యూటీ కంప్ట్రోలర్, ఆడిటర్ జనరల్ (రాజ్‌భాషా) శ్రీ నిలోత్పల్ గోస్వామి మాట్లాడుతూ.. "కృత్రిమ మేధస్సు, కమ్యూనికేషన్ల కలయిక వివిధ ప్రాంతాల మధ్య భాషా అడ్డంకులను అధిగమించగల సామర్థ్యాన్ని కలిగి ఉంది. మన సంస్థాగత ప్రక్రియల్లో భాషా సాంకేతికతను అనుసంధానించడం ద్వారా పరిపాలన, అధికారిక కార్యకలాపాలలో భారతీయ భాషల వినియోగాన్ని బలోపేతం చేస్తూ కమ్యూనికేషన్‌ను మరింత సులభంగా, సకాలంలో, ప్రభావవంతంగా మార్చొచ్చు. భాష, సాంకేతికత విషయంలో దీనిని ఆచరణలోకి తీసుకురావడంలో 'కాగ్-భాషిణి' ఒక ముఖ్యమైన ఘట్టం" అని పేర్కొన్నారు.

2026 సెప్టెంబర్ 14 నుంచి 29 వరకు నిర్వహించిన హిందీ పక్షోత్సవాల 2026 కార్యక్రమంలో కూడా కాగ్, భాషిణిల మధ్య ఈ సహకారం విస్తరించింది. సంప్రదాయ హిందీ భాషా కార్యకలాపాలతో పాటు భాషిణి సహకారంతో అభివృద్ధి చేసిన సాంకేతికత ఆధారిత భాషా కార్యకలాపాలు, ఆటలను ఈ వేదికపై పరిచయం చేశారు. దీనివల్ల అధికారులు, ఉద్యోగులు ఇంటరాక్టివ్ ఫార్మట్‌లో భాషా సాంకేతికతతో మమేకం కావడానికి అవకాశం లభించింది.

హిందీ పక్షోత్సవాల సందర్భంగా నిర్వహించిన వివిధ పోటీలు, కార్యకలాపాలలో భారీ సంఖ్యలో అధికారులు, ఉద్యోగులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా అధికారిక భాషా వినియోగం, హిందీ నోటింగ్, డ్రాఫ్టింగ్, అనువాదం, టైపింగ్, ఇతర భాషా-ఆధారిత నైపుణ్యాలతో పాటు భాషిణి-ఎనేబుల్డ్ కార్యకలాపాలను చేపట్టారు. ముగింపు వేడుక సందర్భంగా పోటీల్లో విజేతలుగా నిలిచిన వారికి బహుమతులు, ప్రశంసా పత్రాలు అందజేసి ఘనంగా సత్కరించారు. హిందీ పక్షోత్సవాలలో వారి భాగస్వామ్యాన్ని, ప్రతిభను ఈ వేడుక ద్వారా అభినందించారు.

ఈ కార్యక్రమంలో డిజిటల్ భాషా సాంకేతికతను ఉపయోగించడంపై ఒక ప్రత్యేక ప్రదర్శనతో పాటు హిందీ, భారతీయ భాషల వినియోగంలో పెరుగుతున్న సాంకేతికత పాత్రపై అధికారులకు అవగాహన కల్పించే లక్ష్యంతో వివిధ ప్రదర్శనలు, కార్యకలాపాలు నిర్వహించారు. కేవలం అనువాదాలు, అధికారిక పనులకే పరిమితం కాకుండా ప్రభుత్వ రంగంలో ప్రజలతో మాట్లాడటానికి, వారి భాగస్వామ్యాన్ని పెంపొందించడానికి కూడా లాంగ్వేజ్ఏఐ ఎంతగానో తోడ్పడుతుందని ఈ భాగస్వామ్యం నిరూపించింది. సంస్థాగత వ్యవస్థలో లాంగ్వేజ్ఏఐ ఆచరణాత్మక అనువర్తనాలను అన్వేషించడానికి కాగ్, భాషిణిల మధ్య జరిగిన విస్తృత సహకారానికి 'కాగ్-భాషిణి అనువాద్' ఆవిష్కరణ, సాంకేతికత ఆధారిత హిందీ పక్షోత్సవ కార్యక్రమాలు ప్రతీకగా నిలుస్తున్నాయి. అధికారిక సమాచారాన్ని మరింత విస్తృతమైన బహుభాషా రూపంలో అందించడానికి భాషా సాంకేతికత, మానవ నైపుణ్యం, సంస్థాగత అవసరాలను ఇది ఒకచోట చేర్చుతుంది.

ఏఐ-ఆధారిత బహుభాషా డిజిటల్ చేరిక కోసం ఏర్పాటైన జాతీయ వేదిక అయిన డిజిటల్ ఇండియా భాషిణి డివిజన్ (డీఐబీడీ)... కేంద్ర ప్రభుత్వ ఎలక్ట్రానిక్స్, సమాచార సాంకేతిక మంత్రిత్వ శాఖ (మైటీ) ఆధ్వర్యంలోని డిజిటల్ ఇండియా కార్పొరేషన్ (డీఐసీ) కింద పనిచేస్తోంది. భాషిణి ప్లాట్‌ఫామ్ 800కి పైగా ప్రభుత్వ వెబ్‌సైట్‌లలో పనిచేస్తోంది. ఇది ఇప్పటివరకు 9 బిలియన్లకు పైగా సంచిత ఏఐ అనుమితులను (ఇన్ఫరెన్సెస్) సాధించింది. రోజువారీగా 24 మిలియన్లకు పైగా ఏఐ అనుమితులను ప్రాసెస్ చేస్తోంది. 36 భారతీయ టెక్స్ట్ భాషలు, 23 భారతీయ వాయిస్ భాషలు, 35 అంతర్జాతీయ భాషలకు మద్దతు ఇస్తూ లాంగ్వేజ్ఏఐ ద్వారా డిజిటల్ ప్రజా మౌలికసదుపాయాలను మరింత అందుబాటులోకి తీసుకువస్తోంది

# అంగన్వాడీలకు రూ.26 వేల కనీస వేతనం ఇవ్వాలి

## గాంధీ విగ్రహానికి సీఐటీయూ, ఏఐటీయూసీ నేతల వినతి



చిత్తూరు, అక్టోబర్ 2: అంగన్వాడీ వర్కర్లు, హెల్పర్లు, మినీ వర్కర్లకు కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాలని సీఐటీయూ, ఏఐటీయూసీ నాయకులు డిమాండ్ చేశారు. అంగన్వాడీల సమస్యలను పరిష్కరించేలా దేశ, రాష్ట్ర పాలకులకు జ్ఞానం కలిగించాలని కోరుతూ గాంధీ జయంతి సందర్భంగా శుక్రవారం చిత్తూరులోని గాంధీ విగ్రహానికి వినతిపత్రం సమర్పించారు. తొలుత గాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

ఈ సందర్భంగా ఏపీ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ సీఐటీయూ జిల్లా కార్యదర్శి షకీలా, ఏపీ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షురాలు ప్రభావతి మాట్లాడుతూ 2019 నుంచి అంగన్వాడీ వర్కర్లు, హెల్పర్లు, మినీ వర్కర్ల వేతనాలు పెంచకపోవడం దారుణమన్నారు. ఐసీడీఎస్ వ్యవస్థ ఏర్పడి 51 ఏళ్లు పూర్తయినా ఇప్పటికీ సంస్థాగతీకరణ జరగకపోవడం విచారకమన్నారు. నిత్యావసర వస్తువుల ధరలు నిరంతరం పెరుగుతున్నా అంగన్వాడీల వేతనాలు పెంచకుండా వారి కుటుంబ జీవనం ఎలా సాగుతుందో పాలకులు ఆలోచించాలని కోరారు.

అంగన్వాడీలపై యాప్‌ల పేరుతో పని భారం పెంచారని విమర్శించారు. వేతనాల పెంపు కోసం అనేక పోరాటాలు చేసిన నేపథ్యంలో 2024 జూలైలో వేతనాలు పెంచుతామని మినిట్స్ కాపీ ఇచ్చినా ఇప్పటి వరకు అమలు చేయలేదన్నారు. ఇటీవల ప్రభుత్వ ఉద్యోగులకు పీఆర్సీ అమలు చేస్తామని ప్రకటించిన ప్రభుత్వం అంగన్వాడీలకు వేతనాలు పెంచడంతో పాటు ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యాలను కూడా వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు.

సీఐటీయూ గౌరవాధ్యక్షుడు వాడ గంగరాజు, ఏఐటీయూసీ గౌరవాధ్యక్షుడు నాగరాజు మాట్లాడుతూ అంగన్వాడీలకు కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాలని, సుప్రీంకోర్టు తీర్పును అమలు చేయకపోవడం ఏమిటని ప్రశ్నించారు. గ్రామీణ ప్రాంతాల్లో పనిచేస్తున్న అంగన్వాడీలకు, వారి కుటుంబ సభ్యులకు సంక్షేమ పథకాలు అమలు చేయాలని కోరారు. హెల్పర్ల పదోన్నతులకు సంబంధించి మార్గదర్శకాలు జారీ చేసిన జీవో 5ను సవరించాలని డిమాండ్ చేశారు. పెండింగ్‌లో ఉన్న టీఏ బిల్లులను వెంటనే చెల్లించాలని, లబ్ధిదారులకు అందించే మెనూను పెంచాలని కోరారు. ప్రీస్కూల్‌లో ఒక్కో చిన్నారికి 100 గ్రాముల బియ్యం, 25 గ్రాముల కందిపప్పు, 10 గ్రాముల నూనెతో పాటు ఒక్కొక్కరికి రూ.5 చొప్పున అందించాలని డిమాండ్ చేశారు. అంగన్వాడీల సమస్యల పరిష్కారం కోసం ఐక్యంగా పోరాటం కొనసాగిస్తామని, ప్రభుత్వం వెంటనే స్పందించి సమస్యలను పరిష్కరించాలని కోరారు. సమస్యలు పరిష్కరించకపోతే రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలతో పాటు భవిష్యత్తులో జరిగే ఎన్నికల్లో ప్రభుత్వానికి తగిన సమాధానం చెబుతామని నాయకులు హెచ్చరించారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు సురేంద్ర, ఏఐటీయూసీ నాయకులు మణి, అంగన్వాడీ సీఐటీయూ అనుబంధ సంఘ నాయకులు సుజని, బుజ్జీ, ఏఐటీయూసీ అనుబంధ సంఘ నాయకులు, అంగన్వాడీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# అమెరికాలోని మిల్వాకీకి చేరుకున్న శ్రీ పీయూష్ గోయల్.. జీ 20 వాణిజ్య మంత్రుల సమావేశంలో పాల్గొననున్న కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి

న్యూ ఢిల్లీ, అక్టోబర్ 2:జీ 20 వాణిజ్య మంత్రుల సమావేశంలో పాల్గొనేందుకు కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీ పియూష్ గోయల్ అమెరికాలోని మిల్వాకీ నగరానికి చేరుకున్నారు. చికాగోలోని భారత కాన్సులేట్ జనరల్ కాన్సుల్ జనరల్ డాక్టర్ ఎం. ఆనంద్ ప్రకాశ్ ఆయనకు స్వాగతం పలికారు.

నేషనల్ మాన్యుఫ్యాక్చరర్స్ అసోసియేషన్ (ఎన్ఏఎం) ఏర్పాటు చేసిన రౌండ్‌టేబుల్ సమావేశంలో.. అమెరికాలోని ప్రముఖ తయారీ, సాంకేతిక రంగాల సంస్థల సీఈవోలు, సీనియర్ ఎగ్జిక్యూటివ్‌లతో శ్రీ పియూష్ గోయల్ సమావేశమయ్యారు. అమెరికాలోని దాదాపు 3 ట్రిలియన్ డాలర్ల తయారీ రంగ జీడీపీలో అత్యధిక వాటా ఉన్న అగ్రశ్రేణి తయారీ రంగ కంపెనీలకు ఎన్ఏఎంలో విశేష ప్రాతినిధ్యం ఉంది.

ఈ సమావేశంలో శ్రీ పియూష్ గోయల్ మాట్లాడుతూ.. భారత్ - అమెరికా మధ్య ఆర్థిక సంబంధాలు కేవలం సంప్రదాయ వాణిజ్య సంబంధాలకే పరిమితం కాదనీ, పెట్టుబడులు, తయారీ, సాంకేతికత, ఆవిష్కరణలు, దృఢమైన సరఫరా వ్యవస్థలు, ఇరు దేశాల్లో అధిక విలువ కలిగిన సామర్థ్యాలను పెంపొందించే దిశగా సంబంధాలు విస్తరిస్తున్నాయనీ వ్యాఖ్యానించారు.

భారత్‌లో ఆవిర్భవిస్తున్న నూతన అవకాశాలపై, దేశంలో భాగస్వామ్యాలను విస్తరించడం పట్ల ఆయా సంస్థల ఆలోచనలపై సీఈవోలు, సీనియర్ ఎగ్జిక్యూటివ్‌లు తమ అభిప్రాయాలను వివరించారు. భారత్‌లో తమ వ్యాపార నిర్వహణ, విస్తరణ, పెట్టుబడుల విషయంలో కంపెనీలకు తగిన సహకారాన్ని అందించడానికి భారత ప్రభుత్వం సిద్ధంగా ఉందని ఈ సందర్భంగా శ్రీ పియూష్ గోయల్ స్పష్టం చేశారు.

రాక్‌వెల్ ఆటోమేషన్ అంతర్జాతీయ ప్రధాన కార్యాలయంలో.. బిజినెస్ రౌండ్‌టేబుల్ (బీఆర్టీ), ఎన్ఏఎమ్ సంయుక్తంగా ఏర్పాటు చేసిన స్వాగత సన్మాన కార్యక్రమంలో కూడా శ్రీ పియూష్ గోయల్ పాల్గొన్నారు. ఇతర జీ 20 దేశాల వాణిజ్య మంత్రులు, అమెరికన్ కంపెనీల ఉన్నత స్థాయి వ్యాపార దిగ్గజాలతో ఈ సందర్భంగా ఆయన చర్చించారు.

# సీమను ఫ్రూట్ బౌల్‌గా మారుస్తాం..

అమరావతి, అక్టోబర్ 2: రాయలసీమ ప్రాంత అభివృద్ధికి కొత్త దిశ చూపేలా గ్లోబల్ హార్టికల్చర్ హబ్‌ను ఏర్పాటు చేస్తున్నామని ముఖ్యమంత్రి చంద్రబాబు తెలిపారు. కరవు నేలగా పేరున్న సీమ ప్రాంతాన్ని పండ్ల తోటల కేంద్రంగా (ఫ్రూట్ బౌల్) తీర్చిదిద్దుతామని చెప్పారు.

అన్నమయ్య జిల్లా మదనపల్లెలో రాయలసీమ ఉద్యాన హబ్, ఇండియన్ స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్ (ఐఎస్ఏ)కు కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌తో కలిసి సీఎం చంద్రబాబు శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేశ్, రిలయన్స్ ఇండస్ట్రీస్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అనంత్ అంబానీ తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ అనుబంధ రంగాల అభివృద్ధిలో ఉద్యాన పంటలు కీలక పాత్ర పోషిస్తాయని చంద్రబాబు అన్నారు.

రాష్ట్రంలో 6 లక్షల హెక్టార్లలో ఉద్యాన పంటల సాగును విస్తరించే లక్ష్యంతో ముందుకు వెళ్తున్నామని తెలిపారు. ప్రకృతి సేద్యంలో ఆంధ్రప్రదేశ్ ముందంజలో ఉందని పేర్కొన్నారు. సాగునీటి సౌకర్యం కల్పిస్తే రాయలసీమ రైతులు అద్భుతాలు సృష్టిస్తారని సీఎం అన్నారు. ఉత్పత్తికి సరైన మార్కెట్ సదుపాయాలు కల్పిస్తే రైతులు సంపద సృష్టిస్తారని చెప్పారు. సీమ రైతులకు 20 రకాల పంటలను సాగు చేసే సామర్థ్యం ఉందని పేర్కొన్నారు. గ్లోబల్ హార్టికల్చర్ హబ్ ద్వారా పంటలకు మార్కెట్ అవకాశాలు, ధరల స్థిరీకరణ లభిస్తుందని తెలిపారు.

రాయలసీమ పరిస్థితులను మార్చేందుకు సాగునీటి ప్రాజెక్టులకు ప్రాధాన్యం ఇస్తున్నామని చంద్రబాబు చెప్పారు. హంద్రీనీవా ప్రాజెక్టు ద్వారా నీరు అందకపోతే మదనపల్లె ప్రాంతం నుంచి పెద్దఎత్తున వలసలు జరిగేవని అన్నారు.

డ్రిప్ ఇరిగేషన్ సాంకేతికత, పంట కుంటలు, జల సంరక్షణ పథకాల ద్వారా నీటి వినియోగాన్ని మెరుగుపరుస్తున్నామని తెలిపారు.

రూ.35 వేల కోట్ల వ్యయంతో 36 ప్రాజెక్టులను పూర్తి చేసి మూడేళ్లలో జాతికి అంకితం చేసే బాధ్యత తీసుకున్నామని సీఎం చెప్పారు. రాయలసీమలో హంద్రీనీవా ఫేజ్-2, వెలిగొండ ఫేజ్-2, మడకశిర బ్రాంచ్ కెనాల్ విస్తరణ పనులను పూర్తి చేసేందుకు చర్యలు చేపడుతున్నామని తెలిపారు.

# ఇండియా మైనింగ్ వీక్ 2026లో 19 దేశాల దౌత్య కార్యాలయాల ప్రతినిధులతో 'ఇండియా మైనింగ్: గ్లోబల్ కనెక్ట్' కార్యక్రమం

న్యూ ఢిల్లీ, అక్టోబర్ 2:భారత్‌లో మైనింగ్, ఖనిజాల రంగానికి సంబంధించిన అతిపెద్ద సదస్సు, ప్రదర్శన అయిన ఇండియా మైనింగ్ వీక్ 2026లో భాగంగా 'ఇండియా మైనింగ్: గ్లోబల్ కనెక్ట్' పేరుతో అంతర్జాతీయ స్థాయి సమావేశం జరిగింది. ఈ కార్యక్రమంలో 19 దేశాలకు చెందిన దౌత్య కార్యాలయాల ప్రతినిధులు పాల్గొని.. భారత మైనింగ్, ఖనిజాల రంగంలో అంతర్జాతీయ భాగస్వామ్యం, సహకారాన్ని మరింత పెంచేందుకు ఉన్న అవకాశాలపై చర్చించారు.

న్యూఢిల్లీలోని యశోభూమిలో 2026 నవంబర్ 15 నుంచి 17 వరకు ఇండియా మైనింగ్ వీక్ 2026 జరగనుంది. దీనికి సన్నాహకంగా ఈ కార్యక్రమాన్ని కేంద్ర బొగ్గు మంత్రిత్వ శాఖ, గనుల మంత్రిత్వ శాఖలు, మైనింగ్ పరిశ్రమతో కలిసి నిర్వహించాయి.

ఈ కార్యక్రమానికి కేంద్ర బొగ్గు, గనులశాఖ సహాయ మంత్రి సతీష్ చంద్ర దూబే, బొగ్గు మంత్రిత్వశాఖ అదనపు కార్యదర్శి రూపిందర్ బ్రార్ ఆతిథ్యం ఇచ్చారు. దౌత్య కార్యాలయాల సీనియర్ ప్రతినిధులతో పాటు మైనింగ్, ఖనిజ రంగానికి చెందిన భాగస్వాములు కూడా చర్చల్లో పాల్గొన్నారు. ఇండియా మైనింగ్ వీక్ 2026లో ఆయా దేశాలు తమ స్థాయిలో ఎలా భాగస్వామ్యం కావచ్చనే అంశంపై వీరంతా చర్చించారు.

ఇండియా మైనింగ్ వీక్ 2026లో ప్రపంచ మైనింగ్ రంగం నుంచి చురుకైన సహకారం, భాగస్వామ్యం అవసరమని కేంద్ర బొగ్గు, గనుల శాఖ సహాయ మంత్రి శ్రీ సతీష్ చంద్ర దూబే పిలుపునిచ్చారు. ప్రముఖ మైనింగ్ కంపెనీలు, ప్రధాన పెట్టుబడిదారులు, ముఖ్య ప్రతినిధులు ఈ కార్యక్రమంలో పాల్గొనేలా భాగస్వామ్య దేశాలు సహకరించాలని ఆయన కోరారు. ఇలాంటి భాగస్వామ్యం ఇరుపక్షాలకు ప్రయోజనకరంగా ఉండటంతో పాటు మైనింగ్, ఖనిజాల రంగంలో భవిష్యత్తు సహకార అవకాశాలను మరింత బలోపేతం చేస్తుందని ఆయన పేర్కొన్నారు.

భాగస్వామ్య దేశాలకు చెందిన మైనింగ్ శాఖల మంత్రులతో పాటు ప్రముఖ పెట్టుబడిదారులు, పరిశ్రమ ప్రతినిధులు కూడా పాల్గొనేలా విస్తృత అంతర్జాతీయ భాగస్వామ్యాన్ని నిర్ధారించేందుకు ఆసక్తిగా ఉన్నట్లు శ్రీ సతీష్ చంద్ర దూబే తెలిపారు. నవంబర్ 15న న్యూఢిల్లీలోని యశోభూమిలో జరిగే ఇండియా మైనింగ్ వీక్ 2026 ప్రారంభ కార్యక్రమానికి ప్రముఖులు, సంబంధిత రంగాల ప్రతినిధులందరినీ ఆయన సాదరంగా ఆహ్వానించారు.

'ఇండియా మైనింగ్: గ్లోబల్ కనెక్ట్' కార్యక్రమంలో బొగ్గు మంత్రిత్వశాఖ అదనపు కార్యదర్శి రూపిందర్ బ్రార్ మాట్లాడుతూ.. భారతీయ ప్రాచీన విలువైన "వసుధైక కుటుంబం" భావనను ప్రస్తావించారు. ప్రపంచ మైనింగ్ రంగ భవిష్యత్తును తీర్చిదిద్దడంలో భాగస్వామ్యం, పరస్పర సహకారం కీలకమని ఆమె పేర్కొన్నారు. ప్రపంచంలో నాలుగో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా భారత్ ముందుకు సాగుతున్న నేపథ్యంలో దేశ ఆర్థిక వృద్ధి, ప్రపంచ స్థాయి లక్ష్యాలకు మద్దతు ఇవ్వడంలో మైనింగ్, ఖనిజాల రంగం కీలక పాత్ర పోషించాల్సి ఉందని ఆమె అన్నారు. నవంబర్‌లో ఇండియా మైనింగ్ వీక్ 2026 జరగనున్న నేపథ్యంలో ప్రపంచ మైనింగ్ రంగానికి చెందిన వారంతా ఒకచోట చేరి, ఆలోచనలు పంచుకోవాలని, తమ నైపుణ్యాన్ని, అనుభవాన్ని పరస్పరం పంచుకోవడంతో పాటు సహకార అవకాశాలను అన్వేషించాలని ఆమె ఆహ్వానించారు. మరింత ఆవిష్కరణాత్మక, సుస్థిర, ప్రపంచంతో అనుసంధానమైన మైనింగ్ రంగాన్ని తీర్చిదిద్దడంలో ప్రపంచవ్యాప్తంగా ఉన్న భాగస్వాముల ఆలోచనలు, అనుభవం, సహకారం కోసం భారత్ ఎదురుచూస్తోందని రూపిందర్ బ్రార్ తెలిపారు.

ఈ కార్యక్రమంలో మలావి, శ్రీలంక, మొజాంబిక్, అల్జీరియా, అమెరికా, చిలీ, భూటాన్, ఇండోనేషియా, ఇథియోపియా, రష్యా, ఇరాక్, మొరాకో, వెనిజులా, స్పెయిన్, పోలాండ్, మంగోలియా, జాంబియా, ఫ్రాన్స్, ఘనా, యూఎస్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ ప్రతినిధులు పాల్గొన్నారు.

దేశాల ప్రతినిధి బృందాలు, ప్రభుత్వ, సంస్థాగత ప్రతినిధులు, వ్యాపార ప్రతినిధి బృందాలు, వక్తలు, సాంకేతిక నిపుణులు, మైనింగ్-ఖనిజ కంపెనీలు, సాంకేతికత అందించే సంస్థలు, పరికరాల తయారీదారులు, పెట్టుబడిదారులు, పరిశోధనా సంస్థలు, పరిశ్రమ సంఘాల ద్వారా ఇండియా మైనింగ్ వీక్‌లో భాగస్వామ్యం అయ్యే అవకాశాలపై చర్చలు జరిగాయి.

ఈ సమావేశం ద్వారా ఇండియా మైనింగ్ వీక్ 2026 పరిధి, కార్యక్రమాల వివరాలను పంచుకోవడంతో పాటు కీలక ఖనిజాలు, ఖనిజాల అన్వేషణ, మైనింగ్ టెక్నాలజీ, భారీ మైనింగ్ పరికరాలు, ఆవిష్కరణలు, పెట్టుబడులు, వాణిజ్యం, వనరుల అభివృద్ధి వంటి పరస్పర ఆసక్తి కలిగిన అంశాలపై చర్చించే అవకాశం లభించింది. ఆయా దేశాల నుంచి సంబంధిత కంపెనీలు, ప్రభుత్వ సంస్థలు, సంస్థాగత ప్రతినిధులు, పరిశ్రమ సంఘాలు ఇండియా మైనింగ్ వీక్‌లో పాల్గొనేలా సహకరించాలని ఆయా దేశాల దౌత్య ప్రతినిధి బృందాలను కోరారు.

కీలక ఖనిజాలు, వనరుల భద్రత, మౌలిక సదుపాయాల అభివృద్ధి, దేశీయ తయారీపై భారత్ దృష్టి విస్తరిస్తున్న నేపథ్యంలో మైనింగ్ రంగంలోని అన్ని దశల్లో అంతర్జాతీయ సహకారం మరింత కీలకంగా మారుతోంది. ఇండియా మైనింగ్ వీక్ 2026 ద్వారా వివిధ దేశాలు, కంపెనీలు తమ సామర్థ్యాలను ప్రదర్శించడంతో పాటు వ్యాపార అవకాశాలను అన్వేషించేందుకు, భారత విధాన రూపకర్తలు, మైనింగ్ కంపెనీలు, పెట్టుబడిదారులు, సాంకేతికత అందించే సంస్థలతో చర్చలు జరిపేందుకు ఒక వేదికను అందిస్తుంది.

మూడు రోజుల పాటు జరిగే ఇండియా మైనింగ్ వీక్ 2026లో 25,000 మందికి పైగా పరిశ్రమ నిపుణులు, నిర్ణయాధికారులు, 500 మందికి పైగా ప్రదర్శనకారులు, సాంకేతిక ప్రదాతలు, 200 మందికి పైగా వక్తలు, పరిశ్రమ నిపుణులు, 100కు పైగా సమావేశాలు, సాంకేతిక ప్రదర్శనలు, 1,000 మందికి పైగా ప్రభుత్వ, ప్రభుత్వ రంగ సంస్థల (పీఎస్‌యూ) ప్రతినిధులు, 300కు పైగా మైనింగ్, ఖనిజ కంపెనీలు పాల్గొననున్నాయి. ఇందులో 50కి పైగా దేశాల నుంచి భాగస్వామ్యం ఉంటుందని అంచనా.

ఈ కార్యక్రమంలో ఉన్నతస్థాయి సమావేశం, అంతర్జాతీయ ప్రదర్శన, సాంకేతిక సెషన్లు, పరిశ్రమ నాయకులతో చర్చలు, బీ2బీ సమావేశాలు, సాంకేతిక ప్రదర్శనలు, ఉత్పత్తుల ఆవిష్కరణలు ఉంటాయి. వీటిలో బొగ్గు, లోహాలు, కీలక ఖనిజాలు, ఖనిజాల అన్వేషణ, మైనింగ్ టెక్నాలజీ, ఆటోమేషన్, గనుల భద్రత, సుస్థిరత, ఖనిజాల ప్రాసెసింగ్, వనరుల సమర్థ వినియోగం వంటి అంశాలపై చర్చలు జరుగుతాయి. 'ఇండియా మైనింగ్: గ్లోబల్ కనెక్ట్' కార్యక్రమం ఇండియా మైనింగ్ వీక్ 2026కు ముందు నిర్వహిస్తున్న అంతర్జాతీయ విస్తరణ కార్యక్రమంలో భాగం. నవంబర్‌లో జరిగే ఈ సదస్సుకు ముందు అంతర్జాతీయ ప్రభుత్వాలు, మైనింగ్ కంపెనీలు, సాంకేతికత అందించే సంస్థలు, పెట్టుబడిదారులు, పరిశ్రమ సంస్థలతో మరిన్ని చర్చలు, భాగస్వామ్య కార్యక్రమాలు నిర్వహించనున్నారు.

# మహాత్ముడి ఆశయాలు సాధించాలి..

## -ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు



హన్మకొండ, అక్టోబర్ 2:(నేటినిజం ప్రతినిధి)అహింస అనే ఆయుధంతో బ్రిటిష్ పాలకుల నుంచి దేశానికి విముక్తి కల్పించి స్వాతంత్ర్యం తీసుకొచ్చిన మహాత్మా గాంధీ ఆశయాల సాధనలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు పిలుపునిచ్చారు. శుక్రవారం మహాత్మా గాంధీ 157వ జయంతి సందర్భంగా శాయంపేట మండల కేంద్రంలోని గాంధీజీ విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కోట్లాది మంది భారతీయులను ఏకతాటిపైకి తీసుకొచ్చి సత్యాగ్రహం, అహింసా సిద్ధాంతాలతో బ్రిటిష్ పాలకులను ఎదుర్కొని దేశానికి స్వాతంత్ర్యం సాధించడంలో గాంధీజీ కీలక పాత్ర పోషించారని గుర్తుచేశారు. గాంధీజీ చూపిన మార్గం నేటి తరానికి స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. ఆయన ఆశయాల సాధన కోసం నేటి యువత ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సర్పంచ్ చింతల ఉమా, పార్టీ మండల అధ్యక్షుడు దూదిపాల బుచ్చిరెడ్డి, నాయకులు చల్లా చక్రపాణి, మారపల్లి రవీందర్, పత్తిపాక సర్పంచ్ గజ్జి ఐలయ్య, నిమ్మల రమేష్, దుబాసి కృష్ణమూర్తి, కొమ్ముల సదానందం, మస్కే కుమార్, శంకరాచారి తదితరులు పాల్గొన్నారు.

# నిజాంపై బాంబు విసిరిన తెలంగాణ విప్లవ వీరుడు

**అక్టోబర్ 3... నారాయణరావు పవార్ జయంతి**



ఆయన ఒక పోరాట యోధుడు. నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా పోరాడిన ధీరుడు. ప్రాణాలను పణంగా పెట్టి, ప్రాణ త్యాగానికి సిద్ధపడ్డ త్యాగ ధనుడు. రాచరికంలో బందీ అయిన తెలంగాణ ప్రజల స్వేచ్ఛాకాంక్షను ప్రపంచానికి చాటడానికి, నిజాం ప్రభువు హత్యకై ఆయనపై బాంబును విసిరిన సాహస వంతుడు. ఆయనే పోరాటాల పురిటిగడ్డ తెలంగాణ ముద్దుబిడ్డ నారాయణ పవార్. బాంబు గురి తప్పినా, ఆయన బందీ అయినా, ఆయన త్యాగ నిరతి, స్ఫూర్తి దాయకం అయింది. పవార్ బాంబు వేసిన సంఘటనను పార్లమెంట్‌లో భగత్‌సింగ్ చేసిన సాహసంతో నాటి ప్రజలు పోల్చుకునే వారు. అయితే ఆ సాహస వీరునికి ప్రాధాన్యత దక్కలేదు. తానే స్వయంగా నిరాహార దీక్ష చేస్తే గానీ రాజకీయ ఖైదిగా గుర్తించలేదు. నాటి తరానికి పవార్ ఆదర్శవంతుడే అయినా, చరిత్ర ఆయన కు తగిన ప్రాధాన్యత ఇవ్వని కారణంగా, నాటి తరానికి స్ఫూర్తి ప్రదాత అయిన పవార్ పేరు కూడా నేటి తరానికి తెలియని దుస్థితి శోచనీయం. భారత దేశానికి స్వాతంత్ర్యం వచ్చినా, హైదరాబాద్ సంస్థాన ప్రజలు మాత్రం నిరంకుశ బానిసత్వంలో మగ్గక తప్పలేదు. సొంతం చేసుకోవడానికి విశ్వప్రయత్నం చేస్తూ రజాకార్లను ఉసిగొల్పాడు. నిజాంకు అండగా ఖాసిం రజ్వీ నేతృత్వంలోని రజాకార్లు గ్రామాలపై బడి దోపిడి చేయడం, ఇండ్లు తగల బెట్టడం నానా అరాచకాలు సృష్టించగా, హైదరాబాదు సంస్థానాధీశుడు ఏడవ నిజాం నవాబు ఉస్మాన్ ఆలీ ఖాన్ నుంచి విముక్తి కోసం సంస్థాన ప్రజలు 1946 నుంచి 1948 మధ్య వీరోచిత పోరాటం చేశారు.

1926 అక్టోబర్ 3న వరంగల్‌లో జన్మించిన నారాయణరావు పవార్. బాల్యం నుంచే స్వేచ్ఛ భావాలు కలిగి అణచివేత ఏ రూపంలో ఉన్నా సహించేవాడు కాదు. 8వ తరగతిలోనే ఆర్య సమాజ్‌లో చేరాడు.

నిజాం నవాబ్ ఆకృత్యాలు చదివాడు. ప్రత్యక్షంగా చూసాడు. అప్పుడే నిజాం నవాబ్‌కు వ్యతిరేకంగా పోరాడాలని నిర్ణయించు కున్నాడు. కొంత మంది యువకులతో కలిసి ''ఆర్య యువక్రాంతి దళ్'' ఏర్పాటు చేశాడు. దీనికి కొండా లక్ష్మణ్ బాపూజీ సలహాదారుడుగా ఆర్థిక సహాయం చేశాడు. సమకాలీన రాజకీయాలపై నిరంతరం చర్చించేవారు. '' మారు వేశాలలతో వెళ్ళి హైదరాబాద్లో. జిన్నా ''రెచ్చగొట్టే ఉపన్యాసం విన్నాడు.

తెలంగాణ సాయుధ పోరుకు సంఘీభావంగా ఏదైనా చేయాలను కున్నారు. ప్రతి దినం సాయంత్రం నిజాం నవాబ్ దారుల్ షిఫాల ఉండే తన తల్లి సమాధిని దర్శించుకు నేందుకు వెళతాడని తెలుసుకుని మిత్రులతో కలిసి నైజాంను చంపాలని, ప్రాణత్యాగానికైనా సిద్ధపడ్డారు. నారాయణ పవార్, పండిత విశ్వనాధ్ బొంబాయి వెళ్లి బాంబులు కొనాలని బయలు దేరారు. మార్గ మధ్యలో షోలాపూర్ వద్ద కొండా లక్ష్మణ్ బాపూజీ కనబడ్డాడు. విషయం చెప్పారు. ఆరు వందల రూపాయ లిచ్చి జాగ్రత్తలు చెప్పి వెళ్లాడు. బొంబాయి వెళ్లి రెండు బాంబులు, రెండు రివాల్వర్లను తీసుకున్నారు. బాంబులు ఫెయిల్ అయితే రివాల్వర్, అదీ ఫెయిల్ అయితే శత్రువుకు మాత్రం చిక్కకూడదు, పథకం ఎక్కడ పొక్క కూడదు. ఇది పథకం. హైదరాబాద్‌కు వచ్చిన పవార్ నిజాంను ఎందుకు చంపాలనుకున్నది వివరంగా ఒక ఉత్తరం రాసారు. పవార్, జగదీష్, గండయ్యలు దానిపై రక్తంతో సంతకం చేసి నారాయణ స్వామికి ఇచ్చారు. బాంబులు వేసిన తర్వాత విజయవాడకు వెళ్లి ఆ పత్రాన్ని పత్రికలకు, రేడియో సంబంధీకులకు, నారాయణ స్వామి ఇవ్వాలన్నది వారి పథకం. అనుకున్న విధంగా వారు సంసిద్ధ మైన క్రమంలో, 1947 డిసెంబర్ 4న సాయంత్రం సుమారు 4 గంటల సమయాన, కింగ్‌కోఠి రోడ్డు నుండి తల్లి సమాధి దగ్గరకు వెళ్లే సమయంలో నిజాం ఇంటి ముందే గండయ్య, జగదీష్‌తో కలిసి పవార్ మాటు వేశాడు. పవార్ అందరికంటే ముందు ఉన్నాడు. ఒకవేళ అతని చేతిలో తప్పించుకుంటే రెండోవాడు, అక్కడా తప్పితే మూడో వ్యక్తి పూర్తి చేయాలని రెడీ అయ్యారు.

నిజాం కారు పవార్ దగ్గరకు రాంగనే కారుపై బాంబు విసిరాడు. అది గురి తప్పింది. కానీ ఆ బాంబు పేలుడుకు ఒక ఆడ మనిషి చనిపోయింది. మరో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. వెంటనే నిజాంపై రివాల్వర్‌తో కాల్చాలను కున్నాడు. ఈలోపే పోలీసులు పట్టుకున్నారు. బాంబు శబ్దం విన్న జగదీష్, గండయ్య పథకం విజయవంతమైందని అనుకొని వెళ్లిపోయారు. లేకుంటే నిజాంకు అదే ఆఖరి రోజు అయ్యేది. సైకిల్ ఆధారంగా గండయ్యను కూడా అరెస్టు చేశారు. ఐదు రోజులు నారాయణ పవార్‌ను పోలీసులు నానా చిత్ర హింసలు పెట్టారు.

తన కేసును వాదించడానికి కోవడానికి వకీల్‌ను నియమించు కోక, స్వయంగా తానే తన వాదనలను వినిపించు కున్నాడు. ఎందుకు చంపాలను కు న్నాడో విచారణలో వివరించాడు. చివరికి కోర్టు పవార్‌కు ఉరిశిక్ష విధించింది. 1948 సెప్టెంబర్ 18న అది అమలు కావాల్సి ఉండగా, ఒక్క రోజు ముందు సెప్టెంబరు 17 న నిజాము నవాబు వల్లబాయి పటేల్ ముందు లొంగిపోగా, హైదరాబాద్ సంస్థానం స్వతంత్ర భారత్ లో విలీనం అయి పోయింది. సంస్థానం విముక్తి తర్వాత మిలిటరీ గవర్నర్ మేజర్ జనరల్ జె.ఎన్.చౌదరి, ఉరిశిక్షను యావజ్జీవ కారాగార శిక్షగా మార్చాడు. కాని వివిధ సంస్థల ఆందోళనతో 1949 ఆగస్టు 10న జనరల్ చౌదరి వీరిని విడుదల చేశాడు. అతనితోపాటు గండయ్య కూడా విడుదలయ్యాడు.

ఎట్టకేలకు పవార్ 2009 ఆగస్టు 9న నాటి రాష్ట్రపతి ప్రతిభా పాటిల్ ద్వారా పవార్ సన్మానించ బడి నాడు. నారాయణరావు పవార్ 85 యేళ్ళ వయసులో హైదరాబాద్‌లోని కేర్ ఆస్పత్రిలో, 2010, డిసెంబర్ 8 న కన్నుమూసాడు.

తెలంగాణ గర్వించ దగిన పవార్ లాంటి దీరులను, త్యాగ ధనులను భావితరాలకు తెలిసే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి.

నాటి చరిత్ర ను మరవకుండా ఉండేందుకు వైయక్తిక, చారిత్రక సంఘటనలను, సందర్భాలను పాఠ్యాంశాలుగా చేయాలి.



-రామ కిష్టయ్య సంగన భట్ల
9440595494

# సాహిత్యం: అనేక భాషలు, ఒకే ఆత్మ



హైదరాబాద్, అక్టోబర్ 2:శ్రీక్షేత్ర జాతీయ సాహిత్య ఉత్సవం (SNLF) యొక్క ఐదవ వార్షిక సంచిక సందర్భంగా, భువనేశ్వర్ గడ్డ మరోసారి సాహిత్యం, సంస్కృతి మరియు సృజనాత్మకతకు సంబంధించిన విభిన్న స్వరాలతో ప్రతిధ్వనించింది. భువనేశ్వర్‌లోని జయదేవ్ భవన్‌లో సెప్టెంబర్ 26, 27వ తేదీ రెండు రోజుల జరిగిన సాహిత్య ఉత్సవంలో దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాల నుండి కవులు, కథకులు, అనువాదకులు, విమర్శకులు మరియు సాహిత్యవేత్తలు ఒకే వేదికపై సమావేశమయ్యారు. భారతీయ భాషల వైవిధ్యంలో అంతర్లీనంగా ఉన్న సాంస్కృతిక ఐక్యతను ఈ ఉత్సవం చాటిచెప్పింది మరియు సాహిత్యంలో ప్రతిబింబించే మానవ భావోద్వేగాల సజీవ రూపాలను ఆవిష్కరించింది.

ఈ ఉత్సవంలో 'శబ్దబ్రహ్మ' (Shabdabrahma) అనే సాహిత్య పత్రిక ప్రత్యేక సంచిక మరియు 'వాతాయన్' (Vatayan) అనే రంగుల పత్రిక ఘనంగా ఆవిష్కరించబడ్డాయి. మరియు తెలుగులో అనువాదం అయినా కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారం పొందిన మరియి ఎన్నో భాషలులో అనువడింపబడిన ఆతీ ఫణి మోహంతి గారిచే రచించ బడిన ఒడియ మాతృక "మృగయ" తెలుగులో అదే పేరుతొ అందువదింపబడి ఈ సందర్భంగా ఆవిష్కరణ జరుపబడినది అలాగే మహారాష్ట్ర సాహిత్య అకాడమీ పురస్కారం పొందిన శ్రీమతి పరామిత షడంగి Ijya తెలుగులో ''పవిత్రాగ్ని''గా అనువాదం పొంది ఆవిష్కరణ జగిరింది.

వివిధ భారతీయ భాషలకు చెందిన రచయితల ఉనికి మరియు వారి సృజనాత్మక వ్యక్తీకరణలు ఈ కార్యక్రమానికి ప్రత్యేక గౌరవాన్ని చేకూర్చాయి.

సాహిత్యం మనకు కేవలం పదాలను మాత్రమే కాకుండా, తోటి మానవుల అనుభవాలతో అనుసంధానమయ్యే మార్గాన్ని కూడా అందిస్తుంది. వేర్వేరు భాషలలో రాసిన పదాలు వినడానికి భిన్నంగా అనిపించినప్పటికీ, వాటి వెనుక ఉన్న భావోద్వేగాలు– అంటే కరుణ, ప్రేమ, పోరాటం మరియు కలలు– తరచుగా ఒక ఉమ్మడి మానవ కోణంలో కలుస్తాయి. భాషా సరిహద్దులను దాటి మానవులను ఒకరితో ఒకరు అనుసంధానించడమే సాహిత్యానికి ఉన్న గొప్ప శక్తి. శ్రీక్షేత్ర జాతీయ సాహిత్య ఉత్సవం సరిగ్గా ఈ స్ఫూర్తికి ఒక వేదుకగా నిలిచింది.

ఈ ఉత్సవానికి పద్మశ్రీ దేవి ప్రసన్న పట్నాయక్, ప్రముఖ ద్విభాషా కవి అశ్విని కుమార్, ప్రఖ్యాత ద్విభాషా కవి ప్రొఫెసర్ సుబోధ్ సర్కార్, ప్రశంసనీయ హిందీ కవి నరేంద్ర పుండరీక్, ప్రముఖ ఒడియా విమర్శకుడు ప్రొఫెసర్ ప్రఫుల్ల కుమార్ మొహంతి, తెలుగు సాహిత్యవేత్త ప్రసన్న కుమార్, మరియు విక్రమాదిత్య సింగ్ (విశ్వ హిందీ పరిషత్, ఒడిశా విభాగం అధ్యక్షుడు మరియు హిందీ కవి–రచయిత) వంటి అనేకమంది ప్రముఖ సాహిత్య ప్రముఖులు హాజరయ్యారు; వీరితో పాటు చిత్తరంజన్ భోయ్, రచన మరియు సంజయ్ బోరుడే కూడా పాల్గొన్నారు.

కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీతలు ప్రదీప్ బిహారీ, డాక్టర్ హృషికేశ్ మల్లిక్ మరియు అమృత బేరాతో సహా వంద మందికి పైగా కవులు మరియు రచయితలు ఈ ఉత్సవంలో పాల్గొన్నారు. అస్సామీ, బెంగాలీ, హిందీ, ఒడియా, సంస్కృతం, ఉర్దూ, మరాఠీ, ఇంగ్లీష్, తెలుగు, తమిళం, సంబల్పూరి మరియు మైథిలి వంటి వివిధ భాషలకు చెందిన సాహితీవేత్తల భాగస్వామ్యం, ఈ కార్యక్రమాన్ని భారతీయ సాహిత్యం యొక్క విశాలత, బహుళత్వం మరియు సాంస్కృతిక ఐక్యతకు ఒక ఉజ్వల నిదర్శనంగా మార్చింది.

పుస్తకావిష్కరణలు, ప్యానెల్ చర్చలు మరియు విభిన్న భారతీయ భాషలకు చెందిన కవులచే బహుభాషా కవితా పఠనాలు ఈ ఉత్సవంలో ప్రధాన ఆకర్షణలుగా నిలిచాయి. ఒకే వేదికపై వివిధ భాషల రచయితల రచనలను వినడం, భారతీయ సాహిత్యం యొక్క గొప్ప సంప్రదాయాన్ని మరియు ఉజ్వల వైవిధ్యాన్ని నిజంగా ప్రతిబింబించే అనుభవాన్ని అందించింది.

రెండు రోజుల పాటు జరిగిన ఈ ఉత్సవంలో 'అనువాదకుడు వర్సెస్ ఏఐ' మరియు 'కల్పనా రచన సౌందర్యం కోసమా లేక బాధ్యత కోసమా?' అనే రెండు ముఖ్యమైన చర్చా సమావేశాలు జరిగాయి.

'కల్పనా రచన సౌందర్యం కోసమా లేక బాధ్యత కోసమా?' అనే శీర్షికతో జరిగిన సమావేశానికి ప్రఖ్యాత మైథిలి నవలా రచయిత ప్రదీప్ బిహారీ అధ్యక్షత వహించారు. ప్రముఖ ఒడియా కాల్పనిక రచయిత ప్రకాష్ మహాపాత్ర, ప్రొఫెసర్ సుధీర్ జోషి, సంజయ్ బోరుడే, ఉదయ్ థులుంగ్, అస్సామీ కవి రాజీవ్ ఫుకాన్ మరియు పలువురు ఇతర సాహితీవేత్తలతో కలిసి ఈ చర్చలో పాల్గొన్నారు. కాల్పనిక సాహిత్యం యొక్క సౌందర్యశాస్త్రం, సామాజిక ఆందోళనలు మరియు రచయిత బాధ్యతపై వారు తమ అభిప్రాయాలను పంచుకున్నారు.

ఇదిలా ఉండగా, 'అనువాదకుడు వర్సెస్ ఏఐ' అనే అంశంపై జరిగిన ముఖ్యమైన చర్చలో పలువురు పండితులు మరియు అవార్డు గ్రహీత అనువాదకులు చురుకుగా పాల్గొన్నారు. ప్రొఫెసర్ చిత్తరంజన్ అధ్యక్షతన జరిగిన ఈ సదస్సులో, అనువాదం యొక్క మారుతున్న పాత్ర, భాషా సున్నితత్వాలు మరియు కృత్రిమ మేధ యొక్క పెరుగుతున్న ప్రభావంపై శ్యామలీ సేన్‌గుప్తా, సుతపా సాహా, అనిమా దాస్, రాజీవ్ ఫుకాన్, దినేష్ మాలి, బర్నాలి శర్మ, పరామిత షడంగి, మరాఠీ కవి సంజీవ్ బోరుడే, రచన మరియు ఇతరులు తమ ఆలోచనలను పంచుకున్నారు.

ఉత్సవపు మొదటి రోజున, వేదికపై ఉన్న ప్రముఖులలో ప్రఖ్యాత రచయిత అశ్విని కుమార్, ప్రొఫెసర్ సుబోధ్ సర్కార్, పద్మశ్రీ దేబీ ప్రసన్న పట్నాయక్, డా. ఫణి మొహంతి, శ్రీ జమినికాంత దాస్, శ్రీ ప్రణబ్ ఛోట్రాయ్ (సాహిత్య సంస్కృతి సమారోహ్ కార్యదర్శి), మరియు డా. సత్యబ్రత జెనా (జాతీయ సాహిత్య నిర్వాహక కమిటీ కార్యదర్శి) తదితరులు ఉన్నారు. ఈ రెండు రోజుల ఉత్సవంలో యువ మరియు అనుభవజ్ఞులైన సాహితీవేత్తలు ఉత్సాహంగా పాల్గొన్నారు. ముఖ్యంగా మహిళా రచయిత్రుల భాగస్వామ్యం ఈ కార్యక్రమానికి నూతన ఉత్తేజాన్ని అందించింది. పుస్తకావిష్కరణలు, కవితా పఠనాలు మరియు చర్చా కార్యక్రమాల ద్వారా వివిధ భాషల మధ్య సంభాషణకు కొత్త మార్గాలు అన్వేషించబడ్డాయి. ఈ కార్యక్రమ రూపకల్పన గురించి వివరిస్తూ, భాషా పరమైన అడ్డంకులను తొలగించి, వివిధ భారతీయ భాషలకు చెందిన రచయితలకు ఒక ఉమ్మడి వేదికను కల్పించాలనే లక్ష్యంతో గత ఆరు నెలలుగా దీనికి సంబంధించిన ఏర్పాట్లు చేస్తున్నట్లు డాక్టర్ సత్యబ్రత జెనా (కార్యదర్శి, శ్రీక్షేత్ర జాతీయ సాహిత్య ఉత్సవం) మరియు ప్రణబ్ కుమార్ ఛోట్రాయ్ (కార్యదర్శి, సాహిత్య సంస్కృతి సమరోహ్) తెలిపారు. వివిధ రాష్ట్రాల నుండి వచ్చిన విద్యావేత్తలు మరియు సాహితీవేత్తలు ఈ కార్యక్రమ విజయం కోసం నిర్వాహకులకు తమ శుభాకాంక్షలు తెలియజేశారు.

కార్యక్రమం సజావుగా మరియు విజయవంతంగా సాగేలా చూడటంలో నిర్వాహకులు (మోడరేటర్లు) పరమిత షడంగి, సోనాలి సాహు మరియు సంఘమిత్ర రాయ్‌గురు కీలక పాత్ర పోషించారు. చివరగా, డాక్టర్ సరోజ్ మహాపాత్ర వందన సమర్పణ చేశారు.

ఒడిశా కేవలం పుణ్యక్షేత్రాల భూమి మాత్రమే కాదు, ఎప్పటి నుంచో భారతీయ సాంస్కృతిక చైతన్యానికి ఒక ముఖ్యమైన కేంద్రంగా ఉంది. ఈ చారిత్రక మరియు సాంస్కృతిక నేపథ్యంతో జరిగిన 'శ్రీక్షేత్ర జాతీయ సాహిత్య ఉత్సవం', సాహిత్యం ద్వారా సంభాషణ, మేధోపరమైన ఆదానప్రదానాలు మరియు సృజనాత్మక వ్యక్తీకరణకు కొత్త అవకాశాలను కల్పించింది. కేంద్ర సాహిత్య అకాడమీ మరియు ఒడిశా సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత, ప్రముఖ కవి డాక్టర్ ఫణి మొహంతి మార్గదర్శకత్వంలో జరిగిన ఈ ఉత్సవం విజయవంతం కావడంలో ప్రణబ్ కుమార్ ఛోట్రాయ్ (కార్యదర్శి, సాహిత్య సంస్కృతి సమరోహ్) మరియు డాక్టర్ సత్యబ్రత జెనా (సంపాదకులు, జాతీయ సారస్వత ఉత్సవం) కీలక పాత్ర పోషించారు.

# ప్రత్యేక కార్యక్రమం-6 అమలు దిశగా కోల్ ఇండియా లిమిటెడ్ సన్నాహాలపై మంత్రి శ్రీ జి.కిషన్ రెడ్డి సమీక్ష

న్యూ ఢిల్లీ, అక్టోబర్ 2:బొగ్గు మంత్రిత్వశాఖ నేతృత్వంలోని కోల్ ఇండియా లిమిటెడ్ (సీఐఎల్) పరిధిలో ప్రత్యేక కార్యక్రమం–6 అమలు దిశగా సన్నాహాలను కేంద్ర బొగ్గు–గనుల శాఖ మంత్రి శ్రీ జి.కిషన్ రెడ్డి ఇవాళ సమీక్షించారు. ఈ మేరకు 'వ్యర్థం నుంచి అర్థం', ఇ–వ్యర్థాల నిర్వహణపై ప్రధానంగా దృష్టి సారించారు. ఈ కార్యక్రమం కింద పరిశుభ్రత సంస్థాగతీకరణ, పెండింగ్‌లో అంశాల పరిష్కారంపైనా లక్ష్యనిర్దేశం చేసుకున్నారు. బొగ్గు శాఖ కార్యదర్శి, సీఐఎల్ ఛైర్మన్, సీఎండీ, అనుబంధ సంస్థలతో పాటు ఇతర విభాగాల సీనియర్ అధికారులుఈ సమీక్షలో పాల్గొన్నారు.

ఈ కార్యక్రమం కింద బిలాస్‌పూర్‌లోని వసంత్ విహార్‌లో పరిశుభ్రతపై అవగాహన వాకథాన్ నిర్వహించారు. బాలలు పెద్ద సంఖ్యలో ఉత్సాహంగా పాల్గొని పరిశుభ్రత, పర్యావరణ హిత జీవనశైలిపై అవగాహన సందేశం వినిపించారు. అలాగే, ఇక్కడి ఎస్ఈసీఎల్ ప్రధాన కార్యాలయ ప్రాంగణంలో "మన గడప–మన వ్యర్థాలు" ఇతివృత్తంగా వీధి నాటకం ప్రదర్శించారు. పరిశుభ్రత ప్రాధాన్యం, వ్యర్థాల సముచిత నిర్మూలన, పరిసర పరిశుభ్రత, ఆరోగ్యకర వాతావరణ పరిరక్షణ, వ్యక్తిగత బాధ్యతల సమర్థ నిర్వహణ తదితరాలను వీక్షకులకు ఆసక్తికరంగా ప్రదర్శించారు.

ప్రక్షాళన ప్రదేశాల గుర్తింపు: బొగ్గు మంత్రిత్వ శాఖ, కోల్ ఇండియా లిమిటెడ్ సహా ప్రభుత్వ రంగ బొగ్గు సంస్థలతో సంయుక్తంగా అక్టోబరు 2 నుంచి 31 వరకూ చేపట్టే ప్రత్యేక కార్యక్రమం–6 అమలు కోసం 1,565 ప్రదేశాలను గుర్తించారు.

ఫైళ్ల నిర్వహణ: కార్యనిర్వహణ సామర్థ్యం మెరుగుదల, రికార్డుల సత్వర లభ్యత దిశగా 19,499 భౌతిక, 40,094 ఇ–ఫైళ్లపై సమీక్ష నిర్వహిస్తారు.

ఈ మేరకు సమర్థ పాలన–పారదర్శకతపై ప్రభుత్వ దృక్కోణాన్ని బలోపేతం చేస్తూ, ప్రత్యేక కార్యక్రమం–6 కింద నిర్దిష్ట వ్యవధిలోగా అన్ని లక్ష్యాల సాధనకు బొగ్గు మంత్రిత్వశాఖ సన్నద్ధమైంది.

# రోడ్డు ప్రమాదంలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగి మృతి

ఖమ్మం, అక్టోబర్ 2:రోడ్డు ప్రమాదంలో ఓ సాఫ్ట్‌వేర్ ఉద్యోగి మృతి చెందిన సంఘటన భద్రాద్రి కొత్తగూడెంలోని విద్యానగర్ కాలనీ హనుమాన్ ఆలయం సమీపంలో ప్రధాన రహదారి వద్ద చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. వేపలగడ్డకు చెందిన రౌంకు సత్యనారాయణ (27) హైదరాబాద్‌లోని విప్రో కంపెనీలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగిగా పనిచేస్తున్నాడు.

వర్క్‌ఫ్రం హోమ్‌లో భాగంగా స్వగ్రామానికి వచ్చిన ఆయన గురువారం రాత్రి పనినిమిత్తం కొత్తగూడెం వచ్చి తిరిగి అర్ధరాత్రి సమయంలో ఇంటికి వెళ్తున్నాడు. విద్యానగర్ కాలనీ హనుమాన్ ఆలయం సమీపంలో ఎదురుగా వచ్చిన కుక్కను తప్పించబోయి ద్విచక్రవాహనంతో డివైడర్‌ను ఢీకొట్టి కిందపడిపోయాడు.

ఈ ప్రమాదంలో తలకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు వెంటనే ప్రైవేట్ ఆసుపత్రికి తరలించి ప్రథమ చికిత్స అనంతరం ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. చికిత్స పొందుతూ శుక్రవారం ఉదయం మృతి చెందాడు. చేతికందిన కుమారుడు మృతి చెందడంతో కుటుంబ సభ్యులు తీవ్ర విషాదంలో మునిగిపోయారు. పోలీసులు కేసు నమోదు చేసి, మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించినట్లు ఎస్ఐ రవికుమార్ తెలిపారు.

# కరీంనగర్‌కు అక్టోబర్ 4న అమిత్ షా

## ప్రతిమ మెడికల్ కాలేజీ సిల్వర్ జూబ్లీ వేడుకలకు హాజరు

## డీమ్డ్ యూనివర్సిటీ భవన పనులకు శంకుస్థాపన



కరీంనగర్, అక్టోబర్ 2: (నేటినిజం ప్రతినిధి) ప్రతిమ మెడికల్ కాలేజీ ప్రారంభించి 25 ఏళ్లు పూర్తయిన సందర్భంగా అక్టోబర్ 4న నిర్వహించనున్న సిల్వర్ జూబ్లీ వేడుకలకు కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా హాజరుకానున్నారు. ఈ సందర్భంగా ప్రతిమ డీమ్డ్ యూనివర్సిటీ భవన నిర్మాణ పనులకు ఆయన శంకుస్థాపన చేయనున్నారు. పైలాన్ ఆవిష్కరణ, ఫొటో ఎగ్జిబిషన్ ప్రారంభంతో పాటు విద్యార్థులను ఉద్దేశించి నిర్వహించే సభలో అమిత్ షా ప్రసంగించనున్నారు. అమిత్ షా పర్యటన ఏర్పాట్లను కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ పరిశీలించారు. ప్రతిమ మెడికల్ కాలేజీకి చేరుకున్న ఆయన హెలిప్యాడ్, పైలాన్, డీమ్డ్ యూనివర్సిటీ పైలాన్ స్టోన్, ఫొటో ఎగ్జిబిషన్, సభా ప్రాంగణాన్ని పరిశీలించారు. అనంతరం నగర పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం, మేయర్ కొలగాని శ్రీనివాస్, డిప్యూటీ మేయర్ సునీల్ రావు, బీజేపీ జిల్లా అధ్యక్షుడు సాయిని మల్లేశం, ప్రతిమ కళాశాల యాజమాన్యం బోయినిపల్లి శ్రీనివాసరావు, చెన్నమనేని వికాస్ రావు, కరీంనగర్ పార్లమెంట్ కన్వీనర్ బోయినిపల్లి ప్రవీణ్ రావులతో ఏర్పాట్లపై చర్చించారు. ఈ సందర్భంగా బండి సంజయ్ మాట్లాడుతూ.. ప్రతిమ మెడికల్ కాలేజీ ప్రారంభ సమయంలో నాటి కేంద్ర హోంమంత్రి ఎల్.కే. అద్వానీ, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి సీహెచ్. విద్యాసాగర్ రావు చేతుల మీదుగా భవనాన్ని ప్రారంభించిన విషయాన్ని గుర్తుచేశారు. కాలేజీ సిల్వర్ జూబ్లీ వేడుకలకు అమిత్ షా హాజరు కావడం సంతోషకరమన్నారు. యూనివర్సిటీ భవన పనులకు శంకుస్థాపన, పైలాన్ ఆవిష్కరణ, ఫొటో ఎగ్జిబిషన్ ప్రారంభం, విద్యార్థుల సభలో ప్రసంగం వంటి కార్యక్రమాల్లో అమిత్ షా పాల్గొంటారని తెలిపారు. అమిత్ షా పర్యటన షెడ్యూల్అక్టోబర్ 3న రాత్రి 9 గంటలకు అమిత్ షా హైదరాబాద్ బేగంపేట విమానాశ్రయానికి చేరుకుని గ్రాండ్ కాకతీయ హోటల్‌లో బస చేస్తారు. అక్టోబర్ 4న ఉదయం 11 గంటలకు హెలికాప్టర్‌లో మెదక్ జిల్లా తూప్రాన్‌కు చేరుకుని సబర్ డెయిరీ మిల్క్ ప్లాంట్ పనుల ప్రారంభోత్సవంలో పాల్గొంటారు. అనంతరం మధ్యాహ్నం 2 గంటలకు తూప్రాన్ నుంచి హెలికాప్టర్‌లో కరీంనగర్‌కు బయలుదేరి ప్రతిమ మెడికల్ కాలేజీ సిల్వర్ జూబ్లీ వేడుకల్లో పాల్గొంటారు. సాయంత్రం 4.30 గంటలకు హెలికాప్టర్‌లో హైదరాబాద్‌కు తిరుగు ప్రయాణం కానుంది.

# మున్సిపల్ కార్యాలయం ఆవరణలో ఘనంగా గాంధీ జయంతి వేడుకలు



కరీంనగర్, అక్టోబర్ 2: (నేటినిజం ప్రతినిధి) వేములవాడ×మున్సిపల్ కార్యాలయ ఆవరణలో ఘనంగా గాంధీ జయంతి వేడుకలు. ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారి విగ్రహానికి మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు,కమిషనర్ లోకేష్,వైస్ చైర్మన్ నరాల శేఖర్ పూల మాలలు వేసి నివాళులు అర్పించారు.

అనంతరం మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు మాట్లాడుతూ మహాత్మా గాంధీ దేశానికి అందించిన సత్యం,అహింసా సిద్ధాంతాలు ప్రపంచానికే ఆదర్శంగా నిలిచాయని స్వాతంత్ర సమరంలో గాంధీజీ చేసిన త్యాగాలు దేశ సేవ ప్రతి ఒక్కరికి స్ఫూర్తిదాయకమని బ్రిటిష్ వలస పాలనకు వ్యతిరేకంగా మహాత్మా గాంధీజీ సాగించిన పోరాటం భారత స్వాతంత్రోద్యమ చరిత్రలో కీలక ఘట్టంగా నిలిచిందని సత్యం అహింస సత్యాగ్రహాన్ని ఆయుధాలుగా చేసుకొని స్వాతంత్ర ఉద్యమాన్ని ప్రజా ఉద్యమంగా గాంధీ గారు మలిచారు అని ప్రజలు యువత కూడా గాంధీ చూపిన సత్యం అహింసా మార్గంలో నడుస్తూ జాతి సమగ్రతను కాపాడుకోవాలని అదే మనం వారికి ఇచ్చే ఘనమైన నివాళి అని ఈరోజు మరో మహోన్నతమైన వ్యక్తి లాల్ బహదూర్ శాస్త్రి జయంతి సందర్భంగా వారి విగ్రహానికి కూడా పూలమాలవేసి నివాళులర్పించడం జరిగిందని లాల్ బహదూర్ శాస్త్రి భారత దేశ రెండవ ప్రధాన మంత్రిగా దేశ సమగ్ర అభివృద్ధి,రైతుల సంక్షేమం కోసం దేశానికి అందించిన సేవలు చిరస్మరణీయమని జై జవాన్ జై కిసాన్ అనే నినాదంతో దేశ ప్రజలు స్ఫూర్తిని నింపిన మహనీయుడు లాల్ బహదూర్ శాస్త్రి అని భారత్ పాకిస్తాన్ యుద్ధ సమయంలో దేశానికి ధైర్యంగా నాయకత్వం వహించి దేశ రక్షణను పటిష్టం చేయడంలో అనేక సంస్కరణలు చేపట్టారు అని స్వాతంత్ర సమరయోధులు పోరాట యోధులు వారు చేసిన సేవలను స్వాతంత్ర ఉద్యమాలను గుర్తించి గౌరవించాల్సిన బాధ్యత ప్రజలపై, యువతపై ప్రతి ఒక్కరి పైన ఉందని వారన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

Printed, Published and owned by VEENADAS, at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana. Published at SRT-74, Jawahar nagar, Ashok nagar,Hyderabad-500020. Telangana.
'Editor: **BAISA DEVADAS.**
RNI No.52865/93. E-mail :netinijam93@gmail.com.